# తొణికిన స్వర్గం

రైలుపెట్టెలోకి ఎక్కికూర్చుని మూలసీటు దొరికినందుకు ఎంతో సంతోషపడింది కమల. అది ఆడవాళ్ళ పెట్టె కాదు. మగవాళ్ళపెట్టెల్లోకల్లా చిన్నది. ఎంతో సుఖంగా ప్రయాణంసాగిపోడానికి అనువైనదని తృప్తిగా నిట్టూర్చుకుంది. ఆడవాళ్ళకంపార్టుమెంట్‌లో ప్రయాణంచేయడం ఊహించుకోలేనివిషయం. మగవారైతే కనీసం సానుభూతి చూపి చోటుఇస్తారు. మెహర్బానీకైనా గౌరవంగాచూస్తారు. మంచినీళ్ళూ టిఫినులూ అందించి ఎంతో సహాయపడతారు. ఆడవాళ్ళపెట్టెలో ఎక్కితేనా రామ, రామ; కూర్చుందుకు స్థలం యివ్వరు సరికదా-నువ్వే టిక్కెట్టుకొన్నావా? అన్నట్టు దెప్పి ట్రంకులనీ పిల్లలనీ విశాలంగా కూర్చోపెడతారు. ఆ పెట్టెలోకి ఎక్కినమనిషి కర్మకాలి కొంచెం విద్యార్థినిలాంటిదో, ఉద్యోగినిలాంటిదో అయితే హాతోస్మి, వారి చూపులబాణాలని తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరికావాలి. ఎదుటివారుట్టి మూర్ఖులన్నట్టు, ఆమాత్రంకూడా అర్థంచేసుకోలేరన్నట్టూ, పక్కవారితో కళ్ళతోటే మాట్లాడుతారు. ముక్కులూ, మూతులూ విరుచుకుని వెకిలిగా నవ్వుతారు. ఇవన్నీ భరించి చాలీచాలని చోటులోనో, నిల్చునో ఎక్కిన అమ్మాయి కాలక్షేపంచేసి, గమ్యస్థానంలో దిగేసరికి-యిటు ఆడవాళ్ళంటే వెగటు కల్పించుకొంటుంది. లేదా, భయం పెంచుకుంటుంది. బ్రతుకుజీవుడా అంటూ పెద్ద బరువు

దింపేసినట్టు పెట్టే, బెడ్డింగు పట్టుకుని గబగబ దిగిపోతుంది. ఆ రైలుపెట్టెలో కూర్చున్నంతసేపూ అంపశయ్యమీద కూర్చున్నట్టు బాధపడిపోతుంది. ఆ పెట్టెలో మిగిలినవారు ఈమె నో వింతజంతువుని చూసినట్టు చూసి సరదాగా కలసి మెలసి మాట్లాడరు. మాట్లాడనివ్వరు. దుష్టులకి దూరంగా వుండు అన్నట్లు - చదువుకున్న పిల్లలావుంది, జాగ్రత్త, అన్నట్టు ప్రవర్తిస్తారు.

అందుకే కష్టపడి కమల మగవాళ్ళకంపార్టుమెంటులో మూలసీటు సంపాదించుకుని హాయిగా కూర్చుంది. అప్పుడే చీకటులు దట్టమవుతున్నాయి. దీపాలు వెలిగాయి. వూళ్ళో తిరుగుతూవుంటే రోడ్లమీద బాగా వెలుగేనా చిమ్మని వీధి దీపాలు దూరానికి చిన్నచిన్న వెలుగుచుక్కల్లాగా మిళుకు మిళుకున మెరుస్తూ ముచ్చటగా కన్పిస్తున్నాయి. మూలసీటులో కూర్చుని కమల ఆ దీపతోరణాలకేసి చూస్తూంది. రైలు వేగంఅందుకున్నకొద్దీ అవి దూరంఅయి పోయి యింకా చిన్నవిగా కన్పిస్తూనేవున్నాయి. రానురాను ఆచిన్ని వెల్గులు చీకట్లలో కలిసిపోయి కొత్తవి కన్పిస్తున్నాయి. రైల్లోంచి చూస్తేనే ప్రకృతివైశాల్యం కళ్ళకి కడుతుంది. కనుచూపుమేర కన్పించే పొలాలూ, చెట్లూ, నీలి ఆకాశం, చీకట్లని చీల్చుకుపోయే రైలూ, ఆ రైలుపొగలోంచి వేగంగా వెనకతట్టుకుపోయే నిప్పురవ్వలూ - అన్నీ గమ్మత్తుగా వున్నాయి.

అలా దీపాలకేసీ, మారే దృశ్యాలకేసీ చూస్తూనే కమల రైలుచక్రాలరొదకి మాటలు జతచేయడం మొదలు

పెట్టింది. మనం ఏమాట అనుకుంటే ఆమాటే పలుకుతాయి, తిరిగే రైలుచక్రాలు, కమల ఉద్యోగం ఉద్యోగం అనుకుంది...ఉద్యోగం ఉద్యోగం - ఉద్యోగం ఉద్యోగం అంటూ దొర్లిపోతున్నాయి చక్రాలు. నవ్వుకుంటూ పెళ్ళి పెళ్ళి అనుకుంది కమల. అవీ అంతే పెళ్ళి పెళ్ళి - పెళ్ళి అని జంటగా అంటూ సాగిపోతున్నాయి. ఇలాంటి చిన్న విషయాలలో జోస్యంచూసే హృదయదౌర్బల్యానికి నవ్వుకుంది కమల. నిజమే. జీవితంలో పెద్ద సమస్యలన్నీ ఏ రాహుకాలం చూడకుండానే మనఎదుట నిలుస్తాయి. అలాగే జీవితానికి పరమావధి యినీ అని నిశ్చయించేసే పరిష్కారాలనీ అనుకోకుండానే చేసేస్తాం. అలాంటిది చిన్నచిన్న విషయాలకి ప్రశ్నలువేసే, జోస్యంచూసే, మీనమేషాలు లెక్కవేయడం అనవసరం అని తెలిసుండీ చేస్తాం.

కమల అదే ఆలోచనలోపడింది. మధ్యతరగతి కుటుంబాలలో ఏ ఆడపిల్లచదువూ, యిందుకూ అంటూ ఒక పద్ధతి మీద జరగదు. స్కూల్ఫైనలైనా ప్యాసుకాకపోతే తగిన సంబంధం రాదని స్కూలుకిపంపి పెళ్ళిసంబంధాలు వెతకడం ప్రారంభిస్తారు. పెళ్ళికీ డబ్బుకీ అవినాభావసంబంధం ఏర్పడిపోయిన యీరోజుల్లో పెళ్ళి మాటలతో జరుగుతుందా? అప్పోసప్పో చేసి కట్నం గుప్పించే సాహసంలేక, చూసిచూసి నాసిరకం అనుకుంటూ సాధారణవరునిచేతిలో అమ్మాయిని పెట్టలేక మధ్యతరగతి సంసారి సంబంధాలు అలా వెతుకుతూనే వుంటాడు. ఈలోగా అమ్మాయిని యింట్లో కూర్చోబెట్టడం ఎందుకని పై క్లాసులోకి పంపిస్తాడు. ఇలా తండ్రి

సంబంధాలు వెతుకుతూవుండగానే అమ్మాయికాస్తా డిగ్రీ పట్టుకు చక్కా వస్తుంది. డిగ్రీ అమ్మాయికి సంబంధం కుదరడం మరీ కష్టం అయిపోతుంది. దాంతో అమ్మాయి పెళ్ళి అయ్యేదాకా అంటూ ఉద్యోగంలో ప్రవేశించడమో, గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూర్చోవడమో జరుగుతుంది.

ప్రస్తుతం కమల బెంగ అంతా యిదే. కమల స్కూలు ఫైనల్ దాటినక్షణంనుంచీ సంబంధాలు చూస్తూనే వున్నారు సూర్యనారాయణగారు. కాని ఏంలాభం. కాలం కలిసిరాలేదు. కమల అలా క్లాసుదాటి పక్కవూళ్ళో హాస్టల్లో వుండి బి. ఏ. పరీక్షకూడా రాసేసింది. పరీక్షలతర్వాత ఏర్పడే ఆందోళన కమలహృదయాన్ని చుట్టుకుంది. ఈ తర్వాత ఏం చెయ్యాలి? అంటూ అంతూపంతూలేని ప్రశ్న ఎదుటనిలచింది. తండ్రి యింట్లో కూర్చోమంటాడు, తప్పదు. ఆయనదంతా అదోరకం. ఆడపిల్లలు ఉద్యోగంచేయడం నామోషీ. పెళ్ళిచేసి అత్తవారింటికి పంపివేశాక యింక వాళ్ళకర్మ. అదీ ఆయనతరహా. కాని కమలతల్లి పార్వతమ్మ గారితరహా ఈ విషయంలో లౌకికజ్ఞానంతోకూడి కొంచెం ముందాలోచన కలది. మనలోమనమాట, నిజంగా ఆడవాళ్లు పరిస్థితులకి తట్టుకున్నట్టు మగవాళ్లు తట్టుకోలేరు. ఆడవాళ్లు తమ దృక్పథాన్ని సులభంగా కాలానికి తగ్గట్టు మార్చుకోకలరు, కాని అంతత్వరగా మగవాళ్లు మారలేరు. ఏ మధ్యతరగతికుటుంబం చూడండి, యింటియిల్లాలికీ యజమానికి మధ్య నడిచే యీ సంఘర్షణవల్ల పిల్లలు ఎందుకూ కాకుండా పోవడం కన్పించితీరుతుంది.

తగిన సంబంధం దొరక్కపోతే ఏ అప్పోచేసి బి. టి. చదవమంటారేమోనని కమలభయం. బి. టీ. చదివి ఎటు నుంచి కొలిచినా గొత్తితోక జానెడన్నట్లు ఎదుగూబొదుగూ లేని టీచరమ్మ వృత్తి, ఇటు ఆర్థికంగానూ సహాయకారి కాదు. అటు మనస్సుకీ తృప్తినివ్వదావృత్తి. కమలకి యిష్టం లేదు, ఎందుకూ యీపనికోసం కష్టపడి ట్రైనింగుకావడం? అయినా తీరాచేసి నాన్నగారు చదువమ్మా అంటే కాదన లేదు. అదే వచ్చినచిక్కు. ఈమాటు ఎలాగైనా నాన్న గారి,. గట్టిగా చెప్పాలి. ఎందుకీ ధ్యేయంలేని చదువు, నాకు వద్దనిఅనుకుంది కమల.

ఎదురుగుండా సీటులో కూర్చున్న పెద్దమనిషి లంక పొగాకు చుట్ట అంటించాడు. రైలుపెట్టెలో దీపపుబిమ్మా సగం పగిలి ఆ తీగలతొడుగులోంచి గమ్మత్తైన నీడలు జిమ్ముతూంది. ప్రభుత్వంవారిదయవల్ల మూడవతరగతిపెట్టెల్లో సహితం ఫానులుండడం ఎంత సౌకర్యం. ఆ చుట్టపొగ మేఘాలు త్వరగా నాల్గుదిశలూ పరుగెత్తి బయటికిపోతాయని లేచి ఫానువేసిందికమల. అప్పటిదాకా అమ్మాయిని పలకరిద్దామనుకున్న ఆ పెద్దమనిషికీ అవకాశం చిక్కి, "మన దేవూరమ్మా?" అంటూ చుట్టకాస్త కిటికీలోంచి విసిరేశాడు.

"పక్కవూరేనండి..." అంది కమల.

"ఏవూరునుంచీరావడం" అంటూ ఎదురుప్రశ్న వేశాడాయన.

"పరీక్షలురాసి యింటికి వెడుతున్నాను అంది" డొంక తిరుగుడుగా కమల. "ఏ ఫేవా బివేవా!" అన్నాడాయన.

బి. ఏ. అండి. అయితే తెలియకడుగుతానుగానీ,

మీనాన్నకి కొడుకులూగట్రా లేరా?" అన్నాడాయన. అప్పటికికాని ఎదుటివ్యక్తిని నిదానించి చూడలేదు కమల. పెద్దతరహా రైతులా వున్నాడాయన. చెవులకి పోగులు, కోరాఖద్దరుపంచె, అర్ధచేతులజుబ్బా......... మనిషి యీ ప్రశ్న వెయ్యడం సహజమే అనిపించింది కమలకి. "లేరండీ; నేనొక్కతినే సంతానం" అంది ఎంతో నమ్రతగా.

"అదీసంగతి. మరలా చెప్పవేం? లేకుంటే కుర్రాళ్ళని చదివించవద్దా ఆడకూతుళ్ళింకేసి చదివి ఏంచేస్తారుచెప్మా?" అని సగం స్వగతంగా అనుకున్నాడాయన. కమలకి ఆ ప్రశ్నకి సమాధానంయిదీఅని తోచకపోయినా, ఎంతోకోపంవచ్చింది.

"ఏమండీ, ఆడపిల్లలునుటుకూ ఉద్యోగాలుచెయ్యడం లేదా? యింట్లో ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్ళన్నట్లు సహాయం "చేయడంలేదా? అంది. "ఎవరికమ్మా మీరు చేసేసహాయం? కొంప గుల్లగొట్టి చదువులకీ, తరువాయి కట్నాలకీ పోస్తాం. ఆకాస్తా అవనిచ్చి యీ చదువంతా దండగేగా." "అయితే చదువుకున్న అమ్మాయిలు పెళ్ళిచేసుకోకూడదంటారా?" తీవ్రంగానే అడిగింది కమల. ఎదురుగుండా కూర్చున్న పెద్దమనిషి చిన్నగా నవ్వుకున్నాడు. "అందుకేనమ్మా, ఎంత చదివినా ఆడపిల్లలు ఆడపిల్లలే. అదే ఓ కొడుక్కి చెప్పించు. పెద్దవయస్సులో యిష్టంవున్నా లేకున్నా ఈ తండ్రి ఆస్తిపాస్తులు యిచ్చినా యివ్వకున్నా తిట్టుకుంటూనో, కొట్టుకుంటూనో కూటికీ గుడ్డకీ లోటురానివ్వడుగా. ఒక్కగానొక్క కూతురివి అయినందుకు నువ్వు యిల్లరికంవుండి నీ తండ్రికి కొడుకువవుతావా అమ్మా, పిచ్చిగాని" అంటూ

ఎక్కడో చూస్తున్నాడాయన. ఆ చూపు యిక్కడెక్కడా లేదు. కనుచూపు మేర కన్పించే చీకటిసరిహద్దులు దాటి ఎక్కడికో పోతూంది. ఆయనమాటలు మటుకు కమలహృదయంలో నాటుకుపోయాయి. నిజమేనా? నిజమేనా? అంటూ అర్థంలేకుండా ప్రశ్నిస్తూంది హృదయం; ఏమిటీ ఎదురు చూడని ఎప్పుడూ అనుకోని సమస్య అంటూ మొండిగా ప్రశ్నిస్తోంది మెదడు. చుట్టుపక్కల ఎవరిదేనా అలికిడి తెలిస్తేనూ, తనకాహారం అవసరంలేకపోతేనూ నత్తపురువు తన వీపుమీద గుల్లలోకి చుట్టుకుపోయి నిశ్చింతగా వుంటుందిట. అలాగే మనుషులూ పరిపరివిధాల వేధించే సమస్యల పరిష్కారాలని ఆలోచించుకుందుకు అవకాశం యిచ్చే ఓ కవచం వుంటే ఎంత బాగుండును, హాయిగా దాన్లోకి శరీరాన్నీ మనస్సునీ కుదించేసుకుని ఆలోచించుకోవచ్చు. ఎదుటివాడికి అద్దంలోలాగా నీ ఆలోచనలు ముఖంమీద కనిపించవు. అదే అనుకుంది కమల. తండ్రితో వాదించి ఎలాగైనా ఒప్పించి ఏదో ఉద్యోగంలో చేరాలి. లేకపోతే ఎందుకీ చదువు; శుద్ధదండగ... ప్రతీవిషయం పెళ్ళయేదాకా అన్న పొలిమేర కొలతతోనే ఆలోచిస్తారే నాన్నగారు. తన నెందుకు అడగరు? అడిగి తన యిష్టం ఏమిటో ఎందుకు తెలుసుకోరు? ఈ ప్రశ్నలకి సమాధానంగా పెద్ద కూతవేసింది రైలు. స్టేషను వస్తూంది. ఇక మళ్ళీ తనకీ పరీక్షల చదువుకీ స్వస్తి. ఎంత తేలికగా వుంది మనస్సు.

కమలలేచి బెడ్డింగూ పెట్టీ అవీ సీటుమీద పెట్టింది. చేతిసంచి తెరిచి గడియారం చూసింది. అది ఎప్పుడో ఆగి

పోయింది. తన అశ్రద్ధకి నవ్వుకుంది కమల. ఎందుకంటే పొద్దుటే లేవగానే గడియారానికి కీ యివ్వడం మొదటి విధి అని నాన్నగారి నమ్మకం. వారలాగే చేస్తారు. అందుకే అందరూ అలా చెయ్యాలంటారు, చెయ్యకపోతే కోపం. ఎదురుగుండా కూర్చున్న పెద్దమనిషి యింకా అలా కిటికీ లోంచి చూస్తూ ఏదో తనలోతానుగా మాట్లాడుకుంటున్నాడు. అనవసరంగా ఆయన్ని నొప్పించానా అనుకుని... “నే దిగే స్టేషనువచ్చిందండీ, నేనన్నదాన్ని దయచేసి అపార్థం చేసుకోకండి...” అంది.

“అబ్బే! నీ తప్పేంలేదమ్మా. యీ రోజుల్లో అందరు చదువుకున్న అమ్మాయిలూ యిదే ప్రశ్న వేస్తారు. కాని ఆచరణలో ఏం చేస్తారో కాలమే కదా నిర్ణయించాలి...” అంటూ వేదాంతిలా నవ్వేశాడు.

పెద్ద భారాన్ని యీడ్చుకొచ్చి పారేసినట్టు మూల్గి ఆగింది రైలు. రైలు ఆగినక్షణంలో ఎంత కోలాహలం. హడావిడిగా కమల పెట్టే, బెడ్డింగూ పట్టుకుదిగింది. “అమ్మా కమలా, యిటూ” అంటూ గొడుగు చేతితో పట్టుకుని సూర్యనారాయణగారు ముందుకి వచ్చారు. “వచ్చావా నాన్నా, ఒంట్లో బాగుండలేదని రాస్తేనూ, స్టేషన్‌కి రారనుకున్నాను. కులాసాగావుందా? మోకాలు నొప్పేనా?” అంటూ ఎంతో ఆప్యాయంగా ప్రశ్నలవర్షం కురిపించింది కమల. సమాధానంగా నవ్వుతూ పెట్టె అందుకుని సూర్యనారాయణగారన్నారు” నాక్కాదమ్మా, మీ అమ్మకి ఒంట్లో బాగులేదు.

అని, స్టేషనుఅవతలకి దారితీశారు. చేతిసంచి తెరచి టిక్కెట్టు బయటికితీసేసరికి అయిదునిముషాలు పట్టింది కమలకి. ఆ చేతి సంచి మూతి అంతచిన్నది. ఓపట్టాన ఏ జేబుదొంగాకూడా దాంట్లోనుంచి చిల్లరడబ్బులేనా తీయలేడు. "ఎందుకొచ్చిన దమ్మా ఆసంచీ, టిక్కెట్టు చేత్తోపట్టుకోలేకపోయావూ" అని విసుక్కుని బండి మాట్లాడారు సూర్యనారాయణగారు.

అలవాటైన ఆ రోడ్లూ, కొట్లూ దాటుకుంటూ బండి నడకసాగించింది. దారిలో విశేషాలన్నీ ఒక్కొక్కటే చెప్పారు కమలకి. "అమ్మాయి, అనంతంకొడుకు లేడూ, వాడేనే, వాడిపేరేవిటే!" "సుందరమా?" అందికమల. "ఆ, వాడే. వాడింకో ఆర్నెల్లలో సీమనించి దిగివస్తాట్ట. యిప్పట్నుంచీ మీ అమ్మకి భూమ్మీద కాళ్ళానడంలేదు. ఇక ఆ అనంతం సంగతి సరేసరి. అయినా, మీ అమ్మకి బుద్ధివుండక్కరలేదూ ? వాళ్ళెక్కడ మనమెక్కడ! కనీసం మర్యాదగానైనా చూడదే. అక్కడా నిన్నివ్వడం! హుఁ" అంటూ విసుక్కుని కూర్చున్నచోట్లోనే సర్దుకు కూర్చున్నారు సూర్యనారాయణగారు. కమలకి తండ్రికోపంచూస్తే నవ్వొచ్చింది. జాలివేసింది. అందని ద్రాక్ష పులుపు. సుందరంబావ మంచివాడే. కాని తండ్రి అదుపాజ్ఞలు అటువంటివి. తండ్రిడబ్బు పెట్టి ఫారిన్ వెళ్ళి తండ్రిమాట కాదంటాడా ? అయినా నాన్నకెందుకీ ఆక్కసు ? నవ్వొస్తుంది కమల. అదిచూసిన సూర్యనారాయణగారు మండిపడ్డారు. "మీ ఆడవాళ్ళకేం తెలుసు? ఆ అనంతంగాడేదో అందలంఎక్కినట్లు నన్ను చిన్నచూపు చూస్తూంటేనే, నా కూతురేం తక్కువ చదివిందా ?

సుందరానికే యివ్వాలి అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంది మీ అమ్మ, బుద్ధివుండొద్దూ ?'

'అమ్మకేం తెలుసు నాన్నా, అయినా మన అంతస్తుకి అధికులవంచకి మనం ఎందుకూ వెళ్ళడం ?... సుందరం బావని చేసుకోవడం అసలు నాకూ యిష్టంలేదు నాన్నా' అంది కమల మెల్లిగా. 'అదీ - ఆసంగతి గట్టిగా మీ అమ్మకి చెప్పు. వీడుకాకపోతే వీడితాతలాంటిసంబంధం తెస్తాను. అంతేగానీ'...'కోపంలో యింటిదారికూడా చెప్పలేదు బండి వాడికి-అబ్బీ, పక్కసందులోకిమళ్ళి రెండువీధులు వెనక్కి వెళ్ళు' అని కమల అనేదాకా సూర్యనారాయణగారికి తెలి యనేలేదు యింటిసందుదాటి వచ్చేశాం అని.

'అయితే నాన్నా, అందాకా ఏదో ఉద్యోగంలో చేరనా ?' భయపడుతూనే వేసింది ప్రశ్న. 'ఉద్యోగమా ! ఎందుకూ ?' మళ్ళీమాట్లాడలేదు సూర్యనారాయణగారు.

రైలుపెట్టెలోకూర్చుని గట్టిగా తండ్రినెదిరించి ఉద్యోగంచేసి ఉద్ధరిద్దామనుకున్న కమలకీ, నాన్నగారి ప్రశ్నకి సధానందొరక్క తికమకలాడే కమలకీ అసలు పోలికేలేదు. సూర్యనారాయణగారే తిరిగి అన్నారు. 'మనకి ఉద్యోగా లెందుకమ్మా ! అయినా నా అన్నవాళ్ళలో అప్రతిష్ట కాదూ. తండ్రి పెళ్ళీ వం చేయలేదని నన్నుకదమ్మా అంటారు ! కొద్దిరోజులు ఓపికపట్టు. చక్కని సంబంధం తెస్తాను. ఆ మూడుముళ్లూ వేయించేశాక నీయిష్టం. నీయిల్లు స్వర్గంచేసుకున్నా, నరకంచేసుకున్నా అది నీ కర్మ. నిన్న

కట్టుకున్నవాడి అదృష్టం. కొంచెం ఓపికపట్టు తల్లీ' అంటూ నిట్టూర్చిన తండ్రిలో ఆక్షణాన కనుపించిన నిర్లిప్తతని గమనించి కమల ఎందుకలా అడిగానా అని బాధపడింది. బండి యింటిముందు ఆగింది. వచ్చార్రా అంటూ పార్వతమ్మ గారు బయటికి వచ్చారు. 'ఆఁ, నీ గ్రాడ్యుయేట్ కూతురు వచ్చింది. సామాను యింట్లో పెట్టించు' అంటూ చకచక లోపలికి నడిచాడు సూర్యనారాయణగారు.

గంభీరంగా మారిన యీ వాతావరణాన్ని చూసి నోటమాటరాలేదు కమలకి. 'ఏం అమ్మా, నాన్నా నువ్వూ దెబ్బలాడుకున్నారా?' అని అడిగింది.

'అదేం కొత్తేమిటే, పాతికేళ్ళనుంచీ వస్తూన్నదే' అంటూ బండివాడికి డబ్బులిచ్చి పంపేశారు పార్వతమ్మ గారు. దిగాలుపడివున్న కమలతలనిమురుతూ, 'నీకెందుకేతల్లీ బెంగ, హాయిగా పరీక్ష పేసవుతావు. పెళ్ళవుతుందా సరేసరి, లేదూ, నిక్షేపంలాఏదో ఉద్యోగంలో చేరుదువుగాని...'అని ఓదార్చారు కమలని.

ఏమో ఏం జరుగుతుందో... అని హాల్లో కుర్చీలో కూలబడింది కమల. చదువుకునే రోజులలో పేర్చిన పేక మేడలూ, వాటిచుట్టూ అల్లిన సుందరస్వప్నాలూ ఇలాగే కళ్ళముందు తొణికిసలాడి కరిగిపోతాయా?

# 2

పరీక్షరాసి యింటికివచ్చి ఆర్నెల్లు దాటాయి. రెండవ క్లాసులో బి. ఏ. పట్టా పుచ్చుకుంది కమల. బి.ఏ. గౌనుతో ఫోటో తీయించుకుతీరాలని పార్వతమ్మగారి కోరిక కాదన లేక, చక్కగా ఒకచేత్తో తెల్లకాగితపుబుట్టా, యింకో చేయి పుస్తకాలదొంతరమీదా వేసి ఠీవిగా నిలబడి పదిహేను రూపాయలుపెట్టి పెద్ద ఫోటో తీయించుకుంది కమల. ఈ ఫోటో గోడకిపెడితే చాలు అందరికీ తన కూతురు బి. ఏ. పాసయిందని తెలుస్తుంది. నిజమే, ఎంతమందికని సర్టిఫికేటు చూపెట్టడం ? ఆ ఫోటో చూసుకున్నప్పుడల్లా కమలకు, ఎక్కడలేని నిస్పృహా కల్గేది. ఏదో ఘనకార్యం చేసినట్టు సర్టిఫికేటు సంపాదించి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంది. ఇంకేం చేస్తుంది ? ఏరోజు కారోజే ముహూర్తం నిర్ణయమయిపోయినట్టూ, వివాహం కాస్తా జరిగిపోయినట్టూ వున్నాయి సూర్యనారాయణగారి మాటలూ, ప్రయత్నాలూ.

ఏమైతేనేం, ఆర్నెల్లూ గడిచిపోయాయి. అఖ్ఖర్లేదనుకున్నప్పుడు కాలం అర్జెంటుగా పరుగెత్తుతుంది, వద్దన్నపని పిల్లలు తప్పకుండా చేసినట్టు. కొంచెం వ్యవధియిస్తే పరిస్థితులు సానుకూలిస్తాయి, ఊపిరి సలుపుతుంది అని ఎదురుచూడ్డం వృథాప్రయాసే అవుతుంది.

గడచిన ఆర్నెల్లలోనూ కమలకి ఒక విషయంమట్టుకు అర్థంఅయింది. తండ్రిబాధ్యత తనపెళ్ళితో తీరిపోతుంది

ఇంట్లో. అమ్మకీ, నాన్నకీ మధ్య నిత్యంజరిగే మాటల పోటీలూ, దెప్పిపొడుపులూ తగ్గుతాయి...అసలు యింట్లో ప్రశాంతత ఏర్పడి ఒత్తిడి తగ్గడానికి తనకి వివాహంకావడం తప్పించి యింకోదారి లేదు.

మాటవరసకేనా నాన్నగారు తనని అడిగితే ఎంత బాగుండును అనుకుంది కమల. ఇంతచదువుకున్నాక అయినా తనొకవ్యక్తి కాలేదా? యిలా తల్లిదండ్రుల ఆటవస్తువులా, మానసికవ్యధలాగా తనెందుకు తయారవాలి?

గడచిన ఆర్నెల్లలోనూ ఐదారుసార్లేనా కమల తండ్రిఎదుట నిలబడి గట్టిగానే అడిగింది. కాలక్షేపానికైనా ఏదైనా దొరికితే పనిలో చేర్తానని. మొదట్లో ఏదో కూతురు తనకి సహాయంచేయడానికని బాధపడుతోంది అనుకున్నారు సూర్యనారాయణగారు. కాని రెండు మూడుసార్లు రెట్టించి అడిగేసరికి యీ ఉత్సాహం వెనుక కమలకి తల్లి ప్రోత్సాహం వుందని, యిదంతా ఏదో గూడుపుఠాణీ అనీ భావించుకుని కమలని గట్టిగా చీవాట్లు వేశారు. అంతేకాదు, అరరాత్రిచీకటుల నిశ్శబ్దాలని సహితం చీల్చుకుంటూ తల్లీ, తండ్రీ మధ్య జరిగే సూటీపోటీ మాటలయుద్ధాలు ఎన్నోసార్లు విని కమల ఎంతో బాధపడింది.

ఈ వింతవాతావరణానికి, స్తబ్దతకీ అన్నిటికీ కారణం తనే అయినా ఆమాట ఎవరూ పైకి అనరు. చదువుకున్నది. లోకజ్ఞానం ఒద్దన్నా కొంత అబ్బింది. యిలా యింట్లో అందరూ వూపిరిసలపనట్టు కాళ్ళు నేలకాననట్లు బాధపడి పోతుంటే తనెలా నిశ్చింతగా వుండగలదు? అదే చిత్రం.

నీకెందుకే తల్లీ చింత అనేస్తుంది తల్లి. పడే అవస్థేదో నే పడుతూంటే మధ్య నీకెందుకూ ఆవదంముఖం? అన్నట్టు కసుక్కుంటాడు తండ్రి. ఇటువంటి వింత వాతావరణం వదిలి బయటపడితే అదే చాలు అనిపించేలా చేస్తారు. లేకుంటే ఏమిటి? యిరవైరెండేళ్ళు దాటి కాలేజీలో చదివి, నలుగురు స్నేహితులతోనూ మసలిన కన్నెపడుచులకి యింట్లో ఏ గొడవా పట్టించుకోకు అన్నట్టు వుండమంటేకూడా కష్టం కాదా. అందులోనూ పెద్దవాళ్ళు తన నో యింటిదాన్నిగా చేయాలని పడుతున్న తాపత్రయం కళ్ళారా చూస్తూకూడా, నువ్వేం బాధపడకు. నీ సుఖంకోసమే మేమిలా కొట్టుకు ఛస్తున్నాం - అంటే ఏలా వుంటుంది!

చదువుకుంటున్న రోజుల్లో పెళ్ళి, పెళ్ళికొడుకూ, కొత్త సంసారం - అంతా ఓ నవలలోలాగో, సినిమాలో లాగో తప్పించి యింకోలా తోచదు. ఆ నవలలో నాయికా కష్టాలు పడవచ్చు, కాని ఆమె జీవితంలో చిత్రింపబడిన సుందరఘట్టాలే అమ్మాయిలకి నచ్చుతాయి. అలాగే సినిమాల్లోనూ పచ్చపచ్చని చెట్లమధ్యనుంచి ఛెంగుఛెంగున హీరోయిన్ జాట్లువేస్తూ సుకుమారమైన ప్రేమగీతం ఆలాపిస్తూ వుంటే చూసి యిదిగదా జీవితం అనుకుంటారు. అసలింత దాకా ఎందుకూ? హాస్టల్లో అమ్మాయికి దళసరిగా ఉత్తరం వస్తే చాలు, ఉత్తరం అందుకున్న అమ్మాయి ఎంతో రహస్యంగా దాన్ని తన గదిలోకి తీసుకుపోయి కాని చింపదు. మిగిలినవాళ్ళంతా అప్పటి కప్పుడే ఆ ఉత్తరంచుట్టూ సుందర స్వప్నాలల్లుతారు. రకరకాల వూహాలు పెంచి, ఆ అమ్మా

యని గేలిచేస్తారు. కాని పాపం! ఆ వుత్తరం యింటిదగ్గర్నుంచి చీవాట్లు వేస్తూనేమో అని ఏ ఒక్కరికీ తోచదు. అసలు నిజానికది-ఏం' నువ్వు సినిమాలకి గట్రా తిరుగుతూ అసలు చదవడంలేదుట, మన వంశంపేరు కాస్తా మంటకలపకు, అంటూ ఏ తండ్రో, గార్డియనో తనకొచ్చిన ఏ ఆకాశ రామన్న ఉత్తరాన్నో మనస్సులో పెట్టుకుని రాస్తాడు. చదువుకునే అమ్మాయిల హృదయాలు ఆ రోజుల్లో అంత సున్నితంగా, సుందరంగా వుంటాయి. నాన్నగారు ఉత్తరం రాశారు. యీ సెలవలకి యింటికి వెడితే పెళ్ళిచేస్తారుట అని ఏ ప్రాణస్నేహితురాలికైనా హృదయం విప్పి నిజం చెప్పిందా - ఆ అమ్మాయిని ఏడిపించి ప్రాణాలు తీస్తారు. ఆ ఎక్కడాలేని పెళ్ళికుమారుణ్ణి చిలవలూ పలవలూ పెట్టి - వారిద్దరు గడుపబోయే మధుర ఘడియలకి రూపకల్పన చేస్తారు. ఎదుటివ్యక్తి ముఖం సిగ్గుతో జేవురించుకునేలా ప్రవరిస్తారు.

జీవితంలో అందాన్నీ, మాధుర్యాన్నీ మటుకే చూడడం, కోరడం అలవాటుచేసుకున్న అమ్మాయిని యింటి వాతావరణం ఉక్కిరి బిక్కిరి చేయడంలో ఆశ్చర్యం లేదు. ఏ అందమైన డాక్టరో, యింజనీరో భర్తగా లభించడం కష్టమైన విషయంగా, దానికోసం నాన్నగారు కాలికి బలపం కట్టుకు తిరగవలసిన అవస్థగా అసలు తోచనే తోచదు. తన కేం లోపం వుందని అనిపిస్తుంది. అంతేకాని ఊహా ప్రపంచానికీ, నిత్యజీవితానికీ అసలు సంబంధమే ఉండదనీ, ఉండాలని కోరడంకూడ అత్యాశే అవుతుందనీ తోచదు.

కమల యీ ఎదురు చూడని పరిస్థితులకి మూగపడిపోయింది. నా కోడలు అంటూ ముచ్చటగా తేవదీసే అనంతం మామయ్య భార్య కాస్త అటూ యిటూగా మాట్లాడుతోంది. వియ్యానికైనా, కయ్యానికైనా సమఉజ్జీ అన్నారంటూంటుంది. ఆవిడ యింటికి వచ్చి వెళ్ళిన ప్రతిసారీ తల్లీ, తండ్రీ ఘర్షణపడ్డం చూసింది కమల. ఎందుకిలా అనంతం మామయ్య కక్షతీర్చుకున్నట్టు ప్రవర్తిస్తాడు? తన తండ్రేం వెళ్ళి అడగలేదే! అయినా పార్వతమ్మగారి ఆశలు వమ్ముకావడం తప్పలేదు. మాటవరసకైనా ఎందుకీ పై సంబంధాలు చూస్తున్నారని అనలేదు అనంతంగారు. అందుకే అసమర్థతకి కోపం జోడై ఎలాగైనా కమలకి పెళ్ళి చేసితీరాలన్న పట్టుదల వచ్చేసింది సూర్యనారాయణగారికి. ఇంటిపట్టున వుండకుండా సంబంధాలు చూస్తున్నారు. ఎప్పటికేనా ఎవరితోనైనా పెళ్ళికావలసిందే కదా అని అన్నీ సేకరిస్తున్నారు పార్వతమ్మగారు. ఈ హడావిడికి ఉన్న వ్యక్తిత్వం కాస్తా అడుగంటిపోయి, పరిస్థితులకి బానిసలయి తలఒగ్గింది కమల.

ఎన్నో సంబంధాలు, ఎన్నో కారణాలవల్ల కాదనుకోవలసివచ్చింది. చూడవచ్చిన పెళ్ళికొడుకుల కోరికలు చూస్తూంటే ఒకపక్క జాలీ, ఒకపక్క కోపం వచ్చాయి కమలకి. ఇంతటి అసమర్థులా యీ చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న బ్రహ్మచారులు? జీవితంలో తాము కోరుతున్నవి, తల్లీ తండ్రీ యివ్వనివి, తాము సంపాదించుకోలేనివీ-అన్నీ-అత్తవారినుండి రాబట్టాలన్న వారి ఉబలాటం నిజంగా చూడ

తగ్గది. కట్నం యివ్వాలి. ఖరీదైనవి కనీసం రెండు జతలైనా సూట్లు కుట్టించాలి. మంచం, పరుపు, యింటికి కావలసిన పాత్రసామాను యిత్యాదులన్నీ కూతురుకిచ్చి పంపాలి. ఇన్ని పుచ్చుకొన్నందుకు ఖరీదైన రెండు చీరలూ, నాలు కాసులబంగారం పెళ్ళికూతురుకి పెడతారు. జీవితంలో యింతకంటే అసమర్థత చాటుకోవడం వుంటుందా అనుకుంది కమల. పెళ్ళిసమయంలోనే రావలసినవన్నీ రాబట్టుకోవాలన్న పిచ్చిఆత్రుత వారిలో అహంభావాన్నీ, ఔన్నత్యాన్నీకూడా చంపేస్తుంది కాబోలు.

ఎలాగైతేనేం, సూర్యనారాయణగారికి ఒక సంబంధం వచ్చి కుదిరేలా అనిపించింది. అబ్బాయి చూసుకుందుకు వస్తాడన్నరోజున తన తల్లిదండ్రులముఖాల నావరించుకున్న ఆందోళన కమల హృదయాన్ని కలచివేసింది. ఎలాగైనా యీ సంబంధం నిశ్చయం అయి ఆ పెళ్ళికాస్తా అయిపోతే బాగుండును అనుకుంది.

పెళ్ళికొడుకు యింజనీరు. ఏదో కంపెనీలో పని. మంచిజీతమే. పైకివచ్చే అవకాశాలున్నాయి. ఆస్తిపాస్తులంత చెప్పుకోతగ్గవికావు. ఆఁ, మగవాడికి చదువు ఆస్తికాదా ఏం? అంటూ సర్దిచెప్పుకున్నారు సూర్యనారాయణగారు. నలుగురు మనుషులున్న కుటుంబం. ఒక్కడేకొడుకు. శుభస్య శీఘ్రం అన్నారు. మగపెళ్ళివారి అన్ని షరతులకీ ఒప్పుకొని త్వరలోనే ముహూర్తం నిర్ణయించడానికి ఒప్పుకున్నారు. ఏదో పెద్ద భారం యీ భుజాన్నుంచి ఆ భుజానికి మార్చుకున్నట్లు ఫీలైన తండ్రినిచూసి తనూ హాయిగా వూపిరి

పిల్చింది కమల. అవును కాని, అప్పుడే భారం పూర్తిగా తొలగిపోలేదు. ముందు పదిహేను వేల రూపాయిలు పుట్టించాలి. ఉన్నది ఒక్క యిల్లూ, అమ్మ బంగారమూను.

ఓ వారం పదిరోజులు గడిచేసరికి పార్వతమ్మగారికి ఎక్కడలేని సత్తువా వచ్చింది పెళ్ళిపనులు చేయించటానికి. ఇంటిమీద పత్రంరాసి పదిహేను వేలు పుట్టించారు సూర్యనారాయణగారు. అందులో ఐదు వేలు కట్నానికీ, ఇంకో మూడు వేలుదాకా ఇతర లాంఛనాలకీ పోతుంది. మిగిలినది పెళ్ళి ఖర్చుకి. ఒక్కగానొక్క కూతురు దానికి ఘనంగా చెయ్యకపోతే ఇంకెవరికి చేస్తాం? అన్న ఉత్సాహం వచ్చింది సూర్యనారాయణగారికి. దూరతీరాల బంధువులందరు వచ్చారు. ఇల్లంతా కలకల్లాడుతూంది. ఎవరికీ కమల ధ్యాసే లేదు. అందరికీ పెళ్ళిగొడవే. అయినా ఎవరికీ కమల ధ్యాసే లేకపోవడం ఆశ్చర్యంకదూ. అయినా దాన్లో ఏం ఆశ్చర్యంలేదు. మన యిళ్ళలో తల్లిగాని, తండ్రిగాని అమ్మాయిని పిలిచి 'ఏమ్మా అబ్బాయి నచ్చాడా! నీకేమైనా అభ్యంతరాలుంటే చెప్పు' అని అడగరు సరికదా, మనం దాని మంచికోసమేకదా ఇన్నాళ్ళు ఇన్ని సంబంధాలు చూశాం. ఆఖరుకి ఇది నిర్ణయించాం అంటూ తృప్తిపడతారు. అమ్మాయిల జీవితంలో అతిముఖ్యమైన యీ పరిష్కారాన్ని కాస్తా ఇలా పెద్దలు చేసిపెట్టేస్తారు. అందుకే తరువాత భవిష్యత్తులో, సాంసారిక జీవితంలో వచ్చిన కష్టనష్టాలకి పెద్దలే బాధ్యులయినట్లు ఆడబిడ్డలు బాధపడతారు. అది వాళ్ళ కర్మకింద జమకడతారు పెళ్ళిచేసిన పెద్దలు.

ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగూ వేయక పోయినా, కన్నులపండువగా పందిరి వేసి అలంకరించారు కమల పెళ్ళికి. రంగురంగుల ఎలక్ట్రిక్ దీపాలు చూడ ముచ్చటగా వున్నాయి. పచ్చని మామిడాకు తోరణాలు ముద్దులొలికే రంగవల్లులు - అంతా పెళ్ళికళ వుట్టిపడుతూ వున్నాయి.

ఇన్నాళ్ళ ఆందోళనా మాయమై కమలలో కూడా పెళ్ళికళ వచ్చింది. ఒక్కరోజు పెళ్ళికి ఒంటినిండా కాటుక అన్నట్లు ఛాయపసుపు పట్టించారేమో బంగారుబొమ్మలా వుంది కమల. కళ్ళనిండా కాటుక. కాటుకకళ్ళనిండా కలలు.

ఇక పార్వతమ్మగారి హడావిడికీ, సూర్యనారాయణ గారి ఆత్రుతకీ అంతేలేదు. మరకాళ్ళు పెట్టుకు తిరుగుతున్నారు. ముహూర్తానికి రెండురోజులు ముందరే మగ పెళ్ళివారు దిగడంతో కొండవిరిగి మీదపడ్డట్టయింది ఆడ పెళ్ళివారికి. క్షణక్షణం ఏదో ఒకటి కావలసివస్తూనేఉంది. విడిదిఇంట్లో కాళ్ళు విరగదొక్కుకుని తిరగలేక సతమతం అయిపోతున్నారు సూర్యనారాయణగారు. అవును మరి— ఏం లోపం వస్తుందో-వస్తే యీ తతంగం ఎటునుంచి ఎటు తిరుగుతుందో అన్న భయం.

పెళ్ళిచూపులనాడు సరిగ్గా చూడకపోయినా, పెళ్ళికి ముందురోజు పెళ్ళికొడుకుని పరిశీలనగా చూసింది కమల. అంత పొట్టీకాదు పొడుగూకాదు. కాలేజి అమ్మాయిల పరిభాషలో చెప్పాలంటే మిస్టర్ హెర్క్యులెస్ కాంపిటీషన్లో

నగ్గుకు సరికదా అందగాడుగా కూడా మార్కులు తెచ్చుకోలేదు. పెళ్ళికొడుకుని కళ్ళారా చూశాక కమల అనుకుంది. అవకాశం వచ్చినప్పుడు అడగాలని - ఎందుకూ ఇంత కట్నం అడిగారని. తనని తను చూసుకుంది అద్దంలో. తనేం అంత అనాకారి కాదే. నాజూకైన విగ్రహం. తెలివితేటలుట్టిపడే కళ వుంది ముఖంలో. చక్కగా మాట్లాడకలదు. పనిపాటలు తెలుసు. అలాంటిదాన్ని పెళ్ళిచేసుకోవడం అదృష్టం అనుకోవాలే అబ్బాయిలు - అదిపోయి చేసుకుందుకు ఇంతా అని అడగడం ఏమిటి ?

జీవితంలో ఎన్నో మధుర సంఘటనలున్నాయి. ఉంటాయి. కాని వివాహం వాటన్నిటినీ మరపించే మధుర ఘట్టం - కన్నెపడుచు జీవితంలో. పెళ్ళి అయిన మరుక్షణం నుంచీ జీవితంలో దృక్పథమే మారిపోతుంది. పుట్టి పెరిగిన ఇల్లు పరాయి ఇల్లు. తోబుట్టువులకంటే ఓ అడుగు ముందు వుంటారు - భర్తా అత్తవారూ.

కమల పెళ్ళి ఎంతో వైభవంగా జరిగింది. ఏ అవాంతరాలూ రాకుండా, వియ్యాలవారి కయ్యాలు లేకుండా వివాహం అయిందనిపించారు సూర్యనారాయణగారు. ఇక కోటలో పాగా వేసినట్టే అన్నట్టు నిట్టూర్చారు. అప్పగింతల సమయంలో - ఒక్క కూతుర్నే కాదు, సర్వస్వాన్నీ నీకు ధార పోస్తున్నాను - ఎలా చూసుకుంటావో అన్నట్టు నోట మాట రాక కళ్ళంట బొటబొట నీరు కార్చారు. ఓదార్దామన్న పార్వతమ్మగారికే నోట మాట రాలేదు. కమల మనస్సులో మటుకు మసకకమ్ముకున్న సుందర దృశ్యాలూ - పెళ్ళికి

పూర్వం నాన్నగారి ఆందోళనా—అన్నీ అల్లిబిల్లిగా కలిసి పోయాయి.

## 3

ఓ వారం రోజులు అటూ యిటూ మనుగుడుపులలో గడిచిపోయాయి. అంతా ఆనందమయంగా సుఖదాయకంగా కన్పించింది కమలకి. నాల్గురోజులలోనే భర్త ఎంతో అనుకూలుడుగా కమల హృదయంలో ముద్రవేసుకుపోయాడు. కమల నడకలో వచ్చిన ఠీవి, చూపులోవచ్చిన చురుకు చూసి పార్వతమ్మగారు నవ్వుకున్నారు - అసలు ఆడపిల్లలే యింత అని.

పెళ్ళి హడావిడి అయిపోయింది. కమలభర్త రామారావు వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. అత్తవారింటినుంచి రమ్మని కబురువచ్చేదాకా కమల యింట్లోనేవుంది. కాని ఇదివరకు యింట్లో కూర్చోడానికీ యిప్పుడు కూర్చోడానికీ ఎంత తేడా. యింట్లో కూర్చుంటే ఇదివరకుమల్లే- అర్థంలేని భయం, లోటు తెలియని ఆలోచనలూ రావడంలేదు కమలకి. భర్తా తనూ కలిసి సృష్టించబోయే స్వర్గధామాన్ని గురించి పంచరంగులకలలు కంటూంది కమల.

వారాలూ, నెలలూ దాటుతున్నాయి. చక్కచక్కటి ఉత్తరాలు వస్తున్నాయి కమలకి.

ఈ ఎడబాటు ఎన్నాళ్ళు? అంటూ భర్తరాసే ఉత్తరాలు చదివి రెక్కలుంటే ఎగిరి వారి చెంత వాలగా? అని

పించేది కమలకి. నిజమే, హృదయానికే రెక్కలిచ్చాడు భగవంతుడు. శరీరానికికూడా యిస్తే యిక ఏరోప్లేనుల లెక్క ఎవరికీ వుండదు. రోజురోజు రహస్యంగా కూర్చుని సుదీర్ఘాలైన ఉత్తరాలు రాసి రహస్యంగా దాసిదానిచేతికిచ్చి పోస్టు చేయించేది కమల. అమ్మచూస్తే వేళాకోళంచేస్తుందనిభయం, సిగ్గు. చదువుకున్నపిల్లలకి భయభక్తులూ సిగ్గూ వుంటాయా అంటారేమో! అవే వారికి ఎక్కువ. వీరిలో కనిపించే తెగింపూ గాంభీర్యమూ – అన్నీ ఉట్టి మేకపోతుగాంభీర్యం వంటివే. ఉత్తరం పోస్టుచేసివచ్చినదాసీదానికి ఎవరూ చూడకుండా అణాయిచ్చే కమలనిచూసి పార్వతమ్మగారి మాతృహృదయం ఉప్పొంగిపోయేది. ఏదో ఒక యింటిది అయింది అంతే చాలు అని ఆనందించేవారు సూర్యనారాయణగారు. అవును మరి. తల్లిదండ్రులతత్వమే అంత. పెళ్ళిఅయేదాకా ఆడపిల్లలు యింట్లోవుంటే రకరకాలుగా చీదరించుకుంటారు. అనుకోకుండానే మనసు కష్టపడేలాంటిమాటలుకూడా అనేస్తారు. అమ్మాయి బాధపడుతుందేమో అనికూడా తోచదు వాళ్ళకి. ఎలాఒదుల్చుకుందామా అన్నట్లు కాళ్ళకి బలపాలు కట్టుకుని పెళ్ళిసంబంధాలు వెతుకుతారు. తీరాచేసి ఆ పెళ్ళి కాస్తా అయేక ఎక్కడలేని ఆప్యాయతా పుట్టుకువస్తుంది. ఆడకూతురూ యింకెన్నాళ్ళుంటుంది మనింట ? అంటూ ఎక్కడలేని అభిమానం ఒలకబోస్తారు ... ఇటువంటి అభిమానపు జడివానలో తడుస్తూ కమల కాలక్షేపం చేస్తూంది.

ఆరోజు పోస్టుమేన్‌కోసం ఎదురుచూస్తూంటే బరువైన ఓ కవరూ, ఓ కార్డుముక్కా పట్టుకొచ్చి యిచ్చాడు. కార్డు

నాన్నగారికీ, కవరు తనకి. భర్తదగ్గరనుంచి వచ్చిన ఉత్తరం పట్టుకుని లోపలికి వెళ్ళింది కమల. అది చదువుకుంటూ వున్నంతసేపూ బాహ్యప్రపంచపు ధ్యాసేలేదు కమలకి. తర్వాతనే నాన్నగారి మాటలు వినిపించాయి. "అమ్మాయి కమలా, మీ మామగారు ఉత్తరంరాశేరమ్మా. మీ ఆయనకి ఒంట్లో నలతగా వుందిట. యీ నెలాఖరుకైనా నిన్ను పంపమని రాశారు" కమలముఖం భర్త పేరుచెప్పగానే సిగ్గుతో ఎర్రబడింది. అవును మరి. అసలు నిజం తనకి తెలుసు. నాన్నగారి కెలా తెలుస్తుంది? ఎలాగో అలాగ నిన్ను నా దగ్గరకి రప్పించుకొందుకు - అంటూ భర్త రాసిన ఉత్తరంలోని ప్రేమపూరితం అయిన పంక్తులు జ్ఞాపకానికి వచ్చాయి కమలకి.

నాన్నగారు పెట్టబోయే ప్రయాణపు ముహూర్తం కోసం ఎదురుచూస్తూ ఒళ్ళంతా కళ్ళుచేసుకుని తెలుగు కేలండరు తేదీలూ తిథులూ వెతకసాగింది కమల.

అత్తవారింటిలో కమలని దిగవిడిచిరావడానికి పార్వతమ్మగారు ప్రయాణంఅయారు. రైలు ఎక్కించడానికి వచ్చిన సూర్యనారాయణగారికి కళ్ళనీళ్ళపర్యంతం అయింది. ఈసారి రైలులోకూర్చున్న కమలహృదయం తేలికగా గాలిలో తేలుతూంది. దానికి రెక్కలువచ్చాయి, ఊహాప్రపంచంలోని గాలిమేడలు దాటుకుంటూ అది ఎగిరిపోతూంది. దారిపొడుగునా పార్వతమ్మగారు కూతురికి ఏమేమిటో చెప్తూనేవున్నారు. బోధపరుస్తూనేవున్నారు. కాని కమల కవేం తలకెక్కినట్టులేదు. పరీక్షలురాసి యింటికి

వస్తూన్నప్పుడు తన హృదయాని కెవరో బరువైన సంకెళ్ళు వేసినట్టు బాధపడిపోయింది. ఇప్పుడో? హృదయం తేలిక అయి అందరిలాగే యీ చదువుకున్న కమలకూడా స్వేచ్ఛగా గాలిపీలుస్తూంది.

"చదువుకున్న పిల్లవి కమలా. నెమ్మదిగా కన్పించినా ఒట్టి మెతకగా వుండకు. అందరూ లోకువచేస్తారు" అంటూ బుద్ధులు చెప్తూన్న తల్లినిచూసి నవ్వుకుంది కమల. "వంటా వార్పూ నేర్చుకుని యిల్లుదిద్దుకుందుకు చదు వేం అడ్డమా?" అంది కమల. "అలా అంత తేలికైనపనికాదు తల్లీ! అది నీ యిల్లుకాదు. పుట్టిననాళ్ళనుంచీ కలసివున్న వాళ్ళువాళ్ళు. నువ్వో, పైనుంచి వెళ్ళి అక్కడ వేళ్ళూనుకోవాలి. ఈలోగా నేనమ్మా వచ్చే ఒడుదుడుకులన్నీ..." అన్న తల్లినిచూసి జాలి వేసింది కమలకి. అమ్మ ఎంత అమాయకురాలు! "అమ్మా ఇంగ్లీషులో ఒకమాట వుంది, వంతెనలు వచ్చినప్పుడు దాట వచ్చునని. అలాగ్గా, కాలక్రమాన కష్టాలూ సుఖాలూ వంట పడతాయి. యీలోగా క్రిందుమీదుకావడం తలకి స్వాను భవాలబొప్పెలుకట్టడం సహజమేకదూ. అనుభవించి అనుభ వించి కదా యీ విషయాలన్నీ నువ్వు తెలుసుకుని నాకు చెప్పగల్గుతున్నావు!" అంటూ చిన్నగా నవ్వింది. కమల మాటలలోయిచ్చిన ధైర్యానికి పార్వతమ్మగారి ఆరాటం చల్లారింది. ఏదో ఎలాగో నెగ్గుకురాగలదు అన్న ధైర్యం వచ్చిందామెకి.

అవునుమరి. అత్తవారింటికి పంపించేటప్పుడు తల్లుల ఆరాటం అలా వుండడంలో ఆశ్చర్యంలేదు. అత్తగార్ల

గయ్యాళితనం ఒక్క మాటలలోనూ చేష్టలలోనూ వుండక్కరలేదు. అదీ యీ రోజుల్లో నాగరికత తెచ్చుకుంది. చదువుకున్న కోడళ్ళసంఖ్య పెరుగుతున్నకొద్దీ కర్రవిరక్కుండా పాము చావకుండా అన్నట్టు వికృతమైన వాతావరణం ఒకటి సృష్టింపబడుతూంది. అందులో ఎవరికీ (పైవాళ్ళకి) అటు అత్తగారితప్పూ కన్పించదు, యిటు కోడళ్ళలోటూ కన్పించదు.

అసలీ రోజుల్లో చదువుకున్నపిల్లలు చెప్పినమాట విని సవ్యంగా కాపరాలుసాగిస్తారా? అంటూ అందరూ అంటారు. కాని సత్యంచూస్తే దీనికి తల్లక్రిందులుగా వుంటూంది. అసలు చదువుకున్నపిల్లలే అణిగిమణిగీ వుంటున్నారు. ఆ చదువుకున్నది—గర్వం అనేస్తారేమో అన్న భయంవల్ల కానివ్వండి, చదువువల్ల అబ్బిన సంస్కృతి అడ్డురావడంవల్ల కానివ్వండి వాళ్ళెంతో నమ్రతగావుంటున్నారు. సంసారంలో గొడవలు రాకుండా చూసుకోవడంలో, ఖర్చులు చక్కదిద్దుకోవడంలో, పిల్లలపెంపకంలో - అన్నిటిలోను వీరు జాగ్రత్తగానే మసులుకుంటారు. కాని అదేంకర్మో, ఎంత మంచిపేరు తెచ్చుకోవాలని వుంటున్నారో - అంతా అపోహాలపాలు అవుతున్నారు.

స్టేషనుకి కమలమామగారు వచ్చేరు. సామానులు దింపించి బండీ అవీ బేరంచేసి కోడలినీ, వియ్యాపురాలినీ యింటికి తీసుకువెళ్ళేరు. కొత్తకోడలికి దిష్టితీసి మరీ లోపలికి తీసుకువెళ్ళారు కమల అత్తగారు.

భోజనాలూ అవీ ముగిశాక అసలు నిజం కనిపెట్ట

గలిగారు పార్వతమ్మగారు. వియ్యపరాలు ఒంట్లో ఆరోగ్యం సరిగా వుండడంలేదు. పనీపాటల్లో చేదోడుగా వుంటుందని కోడలిని తీసుకురమ్మని రాయించారు. అంతేకాని అల్లుడికి ఏ నలతా లేదు. పూలరంగడులా వున్నాడు. అల్లుడా, అని పిలిస్తే—ఒంకరతాటిచెట్టు సహితం నిఠారుగా నిలబడుతుంది అని తమిళంలో సామెత—అల్లాగ కోడలొచ్చిందని తెలియగానే అత్తగారి సత్తువ సన్నగిల్లడం సహజమే, అప్పటిదాకా చేసిచేసివున్న తల్లికాస్తా, అత్తగారిలా రెస్టుతీసుకుందుకు తహతహలాడుతుంది.

రాత్రి చక్కటి విందుభోజనం తయారుచేశారు కమల అత్తగారు. ఇల్లంతా కొత్తకోడలి రాకతో కొత్తశోభ వచ్చినట్టు వెల్గుతూంది. అయినా కమలకళ్లు ఆత్రంగా ఎవరి రాకకోసమో వెతుకుతున్నాయి. తను యీరోజు వస్తూన్నానని తెలిసీ సెలవుపెట్టి స్టేషనుకి రాకపోయారా?...అనుకుంది. ఇంటికిరాగానే తనని పలకరిస్తారా, ఎలాచూస్తారో? ఏంమాట్లాడుతారో?...అర్థంలేని ఎన్నో విషయాలనిగురించి వూహించుకుంటూ కూర్చుంది కమల. పార్వతమ్మగారూ, కమలఅత్తగారూ గాలిపురాణం చెప్పుకుంటున్నారు. ఆడపడుచులిద్దరూ, దూరదూరంగా తిరుగుతున్నారు కొత్తా సిగ్గు చేత, సాయంత్రం ఆరుకావడమూ, రామారావు యింటికి రావడమూ యిట్టే జరిగాయి. ఇంట్లోకి రాగానే వచ్చావా కమలా, అంటూ చేతులు చాపుతాడన్న భర్త తిన్నగా తలవంచుకు తన గదిలోకి వెళ్ళిపోవడంతో చివుక్కుమంది కమల. చెల్లెలు వెళ్ళి కాఫీ యిచ్చింది. 'ఏవండీ,

కులాసా!' అంటూ చుట్టపుచూపుగా అత్తగార్ని పలకరించి, పేపర్లుపట్టుకుని తిరిగీ గదిలోకి వెళ్ళిపోయాడు రామారావు. చదువుకున్నవాడు, తనూ చదువుకున్నది. సాధారణ స్నేహితులు పలకరించుకున్నట్లు హల్లో అనేనా అనని భర్తమీద చిరుకోపమే వచ్చింది కమలకి. కానీలే అనుకుని ఘాకుకుంది. మామగారుకూడా రాగానే మగవాళ్లు భోజనాలకి కూర్చున్నారు. వారి భోజనాలు ముగియగానే ఆడవాళ్ళంతా కలసి కూర్చున్నారు. లోకాభిరామాయణం చెప్పుకుంటూ భోజనాలుచేస్తూనవ్నా, ఒదినా అని పిలవడానికి సిగ్గుపడుతూన్న ఆడపడుచులూ, మూగనోముపట్టిన భర్తా...వీటన్నిటినీ గురించి ఆలోచిస్తూంది కమల.

నువ్వు పోయి పడుకో అమ్మా. రైలుప్రయాణం కూడాను, అలసిపోయి వుంటావు...'అని అమ్మ అన్నమీదట అత్తగారూ...“అవునే, పోయి పడుకో తల్లీ. పది దాటుతూంది”అన్నారు. బ్రతుకుజీవుడా అంటూ గదిలో ప్రవేశించింది కమల. హాయిగా పడుకొని సిగరెట్టుపొగలు చిమ్మెస్తూన్న భర్తనిచూసి ఎక్కడలేని ఉడుకుబోతుతనం వచ్చింది కమలకి. ఎంత నిశ్చింతగా పడుకున్నారో, వచ్చిన నూతన వధువుని పల్కరించేనా లేదన్న బాధేనా లేకుండా, అనుకుంది. అవును, మగవాళ్ళంతే. ఏకాంతంలో తప్పించి ఆడవాళ్ళపట్ల ఆప్యాయత కనుపరచకూడదనుకుంటారు. ఎంతోఅనుకూలమైన దాంపత్యంలో సహితం యీ ద్వంద్వ వ్యక్తిత్వం కనబడుతూనేవుంటుంది. ఎవరేనా ఎదుటవుంటే హద్దులుదాటకపోవడం సహజమే కాని, ముభావంగా వున్నట్టు

వుండడం, ఆఖరుకి విసుక్కోవడంలాంటివికూడా చేస్తారు కొందరు. ఇది నిజంగానే ఒక్కొక్కప్పుడు సున్నితమైన ఆడవాళ్ళ మనస్సుని గాయపరుస్తుంది. దీనికి ఫలితం ఏమిటో వూహించకలరా? ఏకాంతంలో నీవూ నేనూ అన్న తేడా లేకుండా మసలవలసిన సమయంలో ప్రణయినిగా వుండ వలసినది కాస్తా ముక్కా మూతీ మూరెడుచేసుకొని విసుక్కుంటూ కసురుకుంటూ వుంటుంది. ఎడముఖంగావుంటుంది. ఇలాగే చిలికిచిలికి గాలివాన అన్నట్లు చిన్నచిన్న మానసిక గాయాలు భార్యాభర్తలమధ్య చెలరేగి పెరిగి పెద్దవి కావచ్చు.

ఉడుకుబోతుతనం పెల్లుబికి యిక ఏడ్వకుండా వుండ లేకపోయింది కమల. పెద్ద పరాభవం జరిగినట్లు కొంగు ముఖానికి అడ్డుపెట్టుకుని తలుపుకి చేరపడి నిల్చుండిపోయింది. అప్పుడే అటు చూశాడు రామారావు. కమలబేలతనానికి నవ్వొచ్చింది అతనికి. 'ఇలా రావోయ్, అక్కడే నిలబడి పోయావేం!' అంటూ ఆప్యాయంగా పిలిచాడు. కమలకి మాటలురాలేదు. అలాగే నిల్చుండిపోయిన కమలదగ్గిరకి వచ్చి, 'ఏం కమలా కోపంవచ్చిందా?' అంటూ కౌగిట చేర్చుకున్నాడు రామారావు. దుఃఖం కట్టలుతెంచుకునివచ్చింది కమలకి. అలాగే భర్తహృదయంలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. "ఎందుకు కమలా ఈ అర్థంలేని ఏడుపూ? ఇప్పుడేం జరిగిందనీ? - అర్థంలేనివీ ఆప్యాయమైనవీ ఎన్నో మాటలు. వాటివిలువ వాటిదే." కొంచెంసేపటికి తేరుకున్న కమల ఎర్రనైన కళ్ళతో భర్తని చూసింది. 'మీ మగవాళ్ళే యింత,

కొంపకి వచ్చినదాన్ని పలకరించడానికేనా నోరు రాలేదు కానీ...అయినా నే నెక్కడికెడతానని కదూ మీ ధైర్యం? అవునుమరి, మీరు ప్రేమతో జేరదీసినా, చూసీచూడనట్టు వూరుకున్నా నా అదృష్టం అంతే...'ఏదో అనుకుంటూ పోతూన్న కమలని ఆప్యాయంగా అనుముకుంటూ—"ఏంమాట లవి కమలా! ఇంత చదువుకునీ శుద్ధ ఆడదానిలా మాట్లాడు తున్నావే. ఈ క్షణంకోసం నేనెంతగా ఎదురుచూశానో నీకెలా చెప్తే అర్థంఅవుతుంది?..."అన్నాడు రామారావు. "అవును. పోనీ, ఏం కమలా - అని పలకరిస్తే ఏంపోయిందీ?" చిన్నగా నవ్వాడు రామారావు, "ఏంపోయిందనికదూ అడుగు తున్నావు. అందరిఎదుటా కొత్త పెళ్ళికూతురువికదా, నువ్వా సిగ్గుపడతావు, అందరూ నన్నూ హేళనచేస్తారు. అవునా కాదా?" అని అడుగుతూన్న భర్తకి ఏం సమాధానం చెప్పలేక... "మీరు మరీనూ. అయినా అలా పలకరించక పోయేసరికి ఎంత ఇన్సల్ట్‌గా ఫీలయ్యానో తెలుసా!' అని కమల నిజం బయటపెట్టింది. "అవును, చదువుకున్నదానివి కనుక పల్కరించలేదని బాధపడ్డావు. ఐ యామ్ సారీ కమలా! నువ్వుపడ్డ బాధకి పరిహారం చెల్లించుకుంటానుగా." అని గోముగా క్షమార్పణ కోరుకుంటూన్న భర్తని చూసి చిలిపిగా నవ్వింది కమల 'కమలా, యిది మన తొలి ప్రణయ కలహం. దీన్ని సువర్ణాక్షరాలతో నోట్‌చేసి పెట్టుకోవాలి కదూ?"అంటూ తిరిగి సిగరెట్టు ముట్టించాడు రామారావు.

కిటికీలోంచి వెన్నెల లోపలికి వస్తూంది. పెరట్లోంచి వేపచెట్టుగాలీ చిన్నగా వస్తూంది. తీయనివూహాల సెల

యేసుపై తేలితేలి కమల కళ్ళుమూసి నిద్రకి నాందిపల్కింది. ఇక సంసారం పండువెన్నెలగా యిలాగే సాగిపోతుంది. ఈ సంసారవృక్షానికి చిలవలూ పలవలూ వస్తాయి. అన్నిటికీ తను మూలాధారం అవుతుంది. ఎన్నో తీయని కలలు కంటూ కమల మైమరచి నిద్రించింది.

తెల్లవారుఝాము కాబోలు, చిరుచీకట్లని తరిమి వేస్తూ వెలుగులు మెల్లిమెల్లిగా ఆక్రమించుకుంటున్నాయి. పక్షులు ఒకటే రొదగా అరుస్తున్నాయి. అప్పుడే కళ్ళు తెరచిన కమలకి యింట్లో సందడి విన్పిస్తూంది. అప్పుడే అందరూ లేచారు కాబోలు అనుకుంటూనే నిద్రిస్తూన్న భర్తమీద ఒక చేయి వేసుకుని తిరిగి నిద్రలోపడింది కమల.

ఒకసారి మెళుకువవచ్చాక తిరిగి నిద్ర త్వరగాపట్టదు. కమలకి నిద్ర రేరాదు కాని, లేవడానికి బద్ధకం వేసింది. అలాగే పడుకొని క్షణక్షణానికి తొలగిపోతూన్న చీకటులకేసీ, ఎక్కువవుతూన్న వెలుగుకేసీ చూస్తూ, యింట్లోంచి వినిపిస్తూన్న మాటలు వింటూ పడుకుంది కమల.

“ఇంకా ఒదిన లేవలేదా అమ్మా?” చిన్నాడబడుచు అడుగుతూంది.

“చదువుకున్న పిల్లాయిరీ, అప్పుడే లేస్తుందిటే! అసలు దొరలు తెల్లవారి పదింటికిగాని కళ్లు తెరవరటగా!” అంటూ సాగతీశారు రామారావుతల్లి లక్ష్మమ్మగారు.

“ఊరుకో అమ్మా, ఎవరేనా వింటే బాగుండదూ” అంటూ కసురుకుంది పెద్దమ్మాయి.

"అప్పుడే కాఫీ పనిలో పడ్డట్లున్నారే!" అది అమ్మ గొంతుక.

"ఆ, ఏపాటు తప్పినా సాపాటు తప్పదుగా!" అత్త గారు నీరసంగా ధ్వనించారు.

ఏమి టీ అపశ్రుతి? అనుకుంటూ ఆదరాబాదరాగా లేచింది కమల. తల సవరించుకుని లేవబోయింది. అలాగే చేయిపట్టుకు ఆపేశాడు రామారావు. "అబ్బా! వుండండి, అంతా లేచి పనులుకూడా చూసుకుంటున్నారు. ఇంకా నిద్రేమిటి..."అని చిరుకోపం నటించింది కమల.

"అందరికీ పనిగాని, కొత్తకోడలివి నీకేం పనీ!" అని కూర్చోపెట్టేశాడు రామారావు.

వెనకనుంచి ధ్వనిస్తున్న సూటీమాటలతో-ఈ భోగం ఎన్నాళ్ళు?—అనుకుంది కమల. అవునుమరి, కాలం పరుగెడుతుంది. కొత్తకోడలు కాలంతోపాటు మారి మారి యింటెడు చాకిరీ నెత్తిన వేసుకోవలసిన బాధ్యతకల వ్యక్తిగా తయారవుతుంది. కోడలు యింటికి యజమాని అన్నపేరు సంపాదించుకుంటుంది. దానితోపాటే ఊపిరేనా తీసుకుందుకు వ్యవధిచిక్కని పనిమనిషిగా మారుతుంది. భర్తా, భర్త చుట్టూ అల్లుకున్న సుందర వాతావరణం—అన్నీ సూచనప్రాయంగానే మిగులుతాయి. శాశ్వతంగా మిగిలేవన్నీ చింతలూ, వ్యథలూ. క్షణిక సౌఖ్యాన్నిచ్చే వేభర్తప్రేమా అభిమానమూ. ఇదీ ప్రతిగృహిణి జీవితంలోనూ తప్పక దొర్లిపోయే విషచక్రం.

# 4

కమల సంసారికజీవితంలో అడుగుపెట్టి ఆరు సంవత్సరాలు యిట్టే గడిచిపోయాయి. అవును మరి. కాలం రెక్కలు సాచుకు పరుగెత్తుతుంది. దానితోపాటే మానవహృదయం కూడా. ఈలోగా హృదయానికి తగిలే గాయాలు తగులుతూనే వుంటాయి. మాకేవి మారుతూనే వుంటాయి. లేకుంటే బ్రతకడం కష్టంకదా.

తొలిసంవత్సరం, ప్రణయమూర్తిభర్త, రెండో సంవత్సరముకే భార్య పుట్టినరోజు దగ్గరనుంచి మరచిపోయేటంత సాధారణుడైపోతాడు. కాని స్త్రీమటుకు అలా మారలేదు. అందుకే వచ్చే చిక్కులు. ఊహలరథంలో భర్తని వూరేగిస్తుంది. కాని తానూహించిన దైవం కాకుండా, కనీసం లోటుపాట్లు సహితం లేనివాడు కాకుండాపోవడంతో నిస్పృహచెందుతుంది. కాలానికనుగుణంగా యీ నిజాన్ని గుర్తించుకుందుకు కొత్తకోడలుగా ఆరాధింపబడిన అమ్మాయికి కొంతకాలం పడుతుంది. బుద్ధభగవానునికి జ్ఞానోదయం కల్గినట్లు ఏదో క్షణాన కనువిప్పు కల్గుతుంది.

అందరికీ పనిగాని కొత్తకోడలివి నీకేం పనీ—అంటూ ప్రేమతో కౌగిటచేర్చుకొనేభర్తా వుండడు ... ఇంట్లోవాళ్ళ సమయాసమయాల ప్రవర్తనలకి అనుగుణంగా సర్దుకుపోవడమే మిగులుతుంది.

పెళ్ళి అయి ఆరు సంవత్సరాలు దాటింది. ఈ ఆరు

సంవత్సరాలలోనూ తొలివర్షపు పండుగలన్నిటికీ అల్లుడిని పిలిచి ఆదరించారు సూర్యనారాయణగారు. కమల రెండు మూడుసార్లు వెళ్ళి ఓ వారంరోజులూ పదిరోజులు వుండి వచ్చిందికూడా.

అప్పుడే నిద్రలేచి కూర్చుంది కమల. మనసు పరిపరి విధాలపోయి విసుగ్గా వుంది. 'తల్లిఒంట్లో బాగులేదు. అమ్మాయిని ఓసారి పంపండి' అంటూ పుట్టింటినుంచి వచ్చిన ఉత్తరం మీద ఎంత రాద్ధాంతం జరిగిందీ! ఆయన వెళ్ళమంటే వెళ్ళే హక్కుకూడా లేదా తనకి? అనుకుంది కమల. చేతకానితనానికీ, అసహాయతకీ, రూపం ఇచ్చినట్లు కళ్ళు నీళ్ళతో నిండాయి కమలకి. "ఏంపోయిందమ్మా, ఓ వారంరోజులుండి వస్తుందీ" అని రామారావంటే — "నాయనా, మీయిష్టాలు మీరు తీర్చుకోండి. నే నీ కొంప యీడ్చుకు రాలేను..." అంటూ అందుకున్నారు అత్తగారు. అవును. తను వెళ్ళిపోతే, ఎలా జరుగుతుంది? ఇంటెడుచాకిరీ ఎలాగ జరుగుతుంది? ఆరు సంవత్సరాలలో అల్లుకున్న సుందర స్వప్నాలు సాలెగూళ్ళుగా మారుతాయని ఎలాగ వూహించడం?

వెనుకనుంచి ధ్వనించే సూటీపోటీ మాటలతో యీ భోగం ఎన్నాళ్ళు అనిపించింది కమలకి. అవును మరి. కాలం పరుగెడుతుంది. కాలంతోపాటు మారి, కొత్తకోడలు యింటెడు చాకిరీ నెత్తిన వేసుకోవలసిన బాధ్యతకల వ్యక్తిగా తయారౌతుంది. కోడలు ఇంటికి యజమాని అని పేరు తెచ్చుకుంటుంది. దానితోపాటే ఊపిరి తీసుకుందుకు కూడా

వ్యవధిచిక్కని పనిమనిషిగానూ తయారవుతుంది. భర్తా, అతనిచుట్టూ అల్లుకున్న సుందర వాతావరణం అన్నీ సూచనప్రాయంగానే మిగులుతాయి. శాశ్వతంగా మిగిలి పోతాయా ? అనిపిస్తుంది. చింతలూ, వ్యధలూ - ఇదీ ప్రతి గృహిణిజీవితంలోనూ తప్పక దొర్లిపోయే విషచక్రం.

ఉదయాన్నే తలలో రకరకాల ఆలోచనలు పెట్టుకుని అలాగే కూర్చుండిపోయింది కమల. గట్టిగా తన భర్తఇచ్చిన హామీని ఆధారంగా ప్రయాణానికి సిద్ధంకావడమా ? ఊరుకో వడమా ! అన్న సందిగ్ధంలో పడిపోయింది.

అప్పుడే కళ్ళు తెరిచిన రామారావుకి కమలఆత్మలోని ఆ వేదన కనుపించలేదు. కాని కళ్ళలో నీరుమాత్రం కన్పిం చింది. 'ఏం కమలా, ఎలాగైనా నేను పంపిస్తానన్నానుగా!' అంటూ ఆప్యాయంగా చేరదీశాడు.

కమలకి దుఃఖంపోయి పౌరుషం వచ్చింది. 'ఎలా గైనా అంటే!' అంటూ ఎదురుప్రశ్న వేసింది.

'కమలా ! నువ్వుకూడా ఇలా అడ్డంగా వాదిస్తే ఎలాగ చెప్పు? ఏదో ఎడ్జస్టుచేసుకుంటూ పోవాలిగాని. అమ్మతత్వం యింకా నీకర్థం కాలేదా ?'

ఈమాటలకి కమలకి కోపం కట్టలు తెంచుకువచ్చింది.

'ఎడ్జస్టు ఎడ్జస్టు అంటారు. మీ అసలు ఉద్దేశం నా కర్థంఅయేలా చెప్తారా ? ఎన్నాళ్ళు ? ఎన్నింటికి యీ సరి దిద్దుకుపోవడం ? బతికున్నన్నాళ్ళూనా? ఏం? పోనీ అని మన కనుకూలంగా వాళ్ళెందుకు మారరు? తన కోరూలూ, ఎదుటవారి కోరూలూనా?'

'కమలా, ఏమిటివాళ యిలా మాట్లాడుతున్నావు?'

'అవును. మాట్లాడవలసిన అవసరం వచ్చిందికనక మాట్లాడుతున్నాను - ఇలా ప్రతి చిన్న విషయానికీ నాతోఎవరూ సర్దుకోరుగాని, నేనే సర్దుకుపోవాలా? మాటలు పడ్డానికి నేను, చాకిరీకి నేను, మొహర్భానికి వాళ్ళూ— ఎక్కడండీ న్యాయం!'

'ఎందుకంత నోరు కమలా? అందరూవింటే మనిద్దరం కూడా యిలా కీచులాడుకుంటున్నామని అనుకోరూ? అయినా నే నేం అన్నానూ?' అంటూన్న రామారావు మాటలు మధ్యలోనే ఆపేసింది కమల.

'అవునవును. నన్నందరూ అంటుంటే అందరూ వినవచ్చు. కాని, నేనన్నమాట ఏ ఒక్కరూ వినకూడదు. నిజమే. నిజానికే నోరు మూయాలి లెండి. నేనేమో చెవులు మూసుకోవాలి' ఆవేశంతో ఇక మాటలు రాలేదు కమలకి.

'ఈ క్షణాన్ని ఏం జరిగిందనీ యింత రాద్ధాంతం కమలా?'

'ఏమండీ! మీరెంత అమాయకులు! ఒంటెవీపుమీద బరువులాగా ప్రాణం విసిగే క్షణం ఎప్పుడొస్తుందో ఎవరూ చెప్పలేరు. నిజమే, యీ క్షణాన ఏం జరగలేదు. కాని గడచిన కోట్లక్షణాలలో జరిగినవి మీరు చూశారుగా! ఊరుకో ఊరుకో అని నన్ను గదమాయిస్తారుగాని, 'ఏది బాగులేదమ్మా' అని కొంచెమైనా నచ్చచెప్పడానికైనా ప్రయత్నించరేం? చిన్నపిల్లలు, ఇంకా పెళ్ళికావలసినవాళ్ళు నాలాగా చదువుకుని చెడిపోకుండా చదివించడం లేదుకదా?

మీ చెల్లెళ్ళకి ఒక్కసారి చెప్పకూడదూ? నే నొచ్చి ఆరేళ్ళవవస్తోందికదా! పుట్టినన్నాళ్ళనుంచీ ఇక్కడ వుండి వీళ్ళ మీద మాట అనే హక్కైనా లేదే మీకు? అలాంటిది నే వచ్చి ఆరేళ్ళైనా అవలేదే, యిన్ని సర్వాధికారాలు ఎలా వచ్చాయి మీకు?'

'కమలా, కోపంలో ఏదో అనేస్తున్నావుగాని, నిన్ను నే నేం కష్టపెట్టాను? మా అమ్మది వింత ధోరణి. చదువుకున్న కోడలు కావాలి కావాలని తహతహలాడిపోయింది. కాని చూశావా? తీరాచేసి నీతో ఏమాత్రం సర్దుకోలేకపోతూంది. అదో కాంప్లెక్సు కమలా! చదువుకున్నదానివి, ఎంతో చక్కగా అన్నీ సర్దుకుపోతున్నావనుకుంటే యిదేమిటీ వేళ? ఇలా చూడు కమలా — మాకంపెనీ బ్రాంచి హెడ్డుక్రింద నన్ను పోస్టుచేస్తారు. అప్పుడు మనం విడిగా యీ చింతలకొలిమి లేకుండా వుందాం. అంతదాకా ఓపిక పట్టలేవ్వా?'

బ్రతిమాలుతున్నట్లు ధ్వనిస్తూన్న భర్త మాటలకి కమలఆవేశం చల్లారలేదు. 'యీ క్షణం బ్రతిమాలి, మరోక్షణంలో ఆ విషయాన్నే మరిచిపోయే మగవారి మాటలు నీటిమూటలేగదా! నేను మీవాళ్ళతో తెగతెంపులుచేసుకోమనడంలేదు. అంత అల్పబుద్ధి కాదు నాది. కాని కాకిచూపులాగా ఎంతసేపూ ఒకపక్కనుంచే చూడగల్గితే ఎలాగ? అయినా నిజం మీ నాన్నగారికి చెప్పి ఎందుకు మనం వేరే ఉండకూడదూ? ఎందుకు మనం వాళ్ళని ఆర్థికంగా ఆదుకోకూడదు? ఇలా అభిమానాలు

చంపుకుని, ఆవేశాలు పెంచుకుని కలిసివుండడంకంటె, వేరుగా వుండి ఆదరణపొందడం మంచిదేమో ఆలోచించండి.'

ఆవేశంతో గబగబా మాట్లాడేస్తూన్న కమలని ప్రేమతో గట్టిగా కౌగలించుకున్నాడు రామారావు.

'నీ కెందుకింత ఆవేశం కల్గిందో యిప్పుడిప్పుడే నా కర్థంఅవుతోంది. నువ్వన్నట్లు నాది కాకిమూపే కమలా! నువ్వు చెంతనుంటే నీ దృష్టే.'

'అవునవును. అటు మళ్ళితే అస లీ గొడవేలేదు. అందుకే హాయిగా వుండగల్గుతున్నారు.'

'అది కాదు కమలా. నాకు యీ దృష్ట్యా ఆలోచించుకొందుకు వ్యవధి కావాలి. గుడ్డెద్దు చేలోపడి మేసినట్లు ఎన్నాళ్ళు బ్రతుకుతాం? అంతదాకా ఓర్పుపట్టు కమలా...''

'మీతల్లి అంటే మీకు గౌరవం వుండొచ్చుగాని, నాతల్లి అంటే అంత నిర్లక్ష్యంగా మాట్లాడ్డం దేనికి? ఏమైనాసరే ఈరోజు సాయంత్రం బండికి నే వెడతాను. కొంచెం టిక్కెట్టూ అదీ కొనిపెట్టండి' అదే తుది నిర్ణయం అయినట్టూ, తను చెప్పదల్చుకొన్నవన్నీ చెప్పేసినట్టూ లేచి నిలబడింది కమల.

'వెళ్ళేదానివి వెళ్ళిపోతున్నావు — ఆ సీరియస్ ముఖంతో గడివిడిచిపోకు కమలా! భరించలేను'

నాటకంఫక్కీలో గుండెలమీద చేతులు పెట్టుకుని అంటూన్న భర్తనిచూసి నవ్వకుండా వుండలేకపోయింది కమల. కాని ఆ నవ్వువెనక గడచిన వసంతాల రంగురంగుల చిగుళ్ళు, గ్రీష్మ వేదనలు — అన్నీ మెదిలాయి.

# 5

పుట్టింటికి వెళ్ళి రెండుమాసాలు దాటిన తరువాత, ఒకనాటి ఉదయాన రామారావుకి ఉత్తరం వచ్చింది పై చిరునామా చూడగానే అది కమల రాసిందనీ, చాలా గంభీరంగా రాసివుంటుందనీ భావించుకున్నాడు రామారావు. అందుకే కవరు చించకుండానే జేబులో పడేసుకున్నాడు. "అదేవిటిరా చింపేనా లేదూ?" అంటూ కొడుకుముఖంలోకి చూశారు లక్ష్మమ్మగారు. తొందరేం లేదని సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు రామారావు కొడుకు ముభావంగా వుంటూ వుండడం, తండ్రితో ఏకాంతంగా చాలాసేపు చర్చలు జరుపుతో వుండడం ఇవన్నీ ఓ రకం దుశ్శకునాలుగానే భావించిన లక్ష్మమ్మగారికి, ఆ కవరు కమలరాసినదని తెలిసి, చదవకుండా ఊరుకోవడం - అంతా అయోమయంగా తోచింది.

కోడలు వెళ్ళి రెణ్నెల్లు దాటినా వస్తానని అదిగాని, రమ్మని కొడుకుగాని ఉత్తరాలు రాయలేదు. తండ్రితో కూర్చుని ఏం నిర్ణయాలు చేస్తున్నాడో అంతుపట్టడం లేదు. ఏమిట్రా అంటూ కూతుళ్ళని అడిగితే "నీ కెందుకొచ్చిన గొడవ అమ్మా, ఊరుకో" అని కసుకుకుంటున్నారు. చెవి నిల్లుకట్టుకు పోరినా ససేమిరా కోడలిని పంపించండని రాయడం లేదు ఆయన. ఏమిటి యీ వింత ధోరణులన్నిటికీ అర్థం ? యిదే అంతుచిక్కడం లేదు లక్ష్మమ్మగారికి. ఏమైనా యీ రాత్రి భోజనాలదగ్గిర తేల్చుకోవాలి అనుకున్నారు.

తెలుగువాళ్ళ సంసారాలలో భోజనాలసమయం చాలా గమ్మత్తుగా వుంటుంది. భోజనం ముందుపెట్టి యింటి యిల్లాలు తన కష్టసుఖాలు వెళ్ళబోయడం మొదలుపెడుతుంది. లేదా తింటూన్న వ్యక్తిచేసిన తప్పొప్పులూ, చేస్తూన్న తప్పులూ, అన్నీ ఏకరువు పెడుతుంది. దెప్పిపొడుపులూ, నిష్ఠూరాలాడ్డం, చిన్నచూపుచూడ్డం అన్నిటికీ అనువైన సమయం భోజనం పెట్టాక అనిపిస్తుంది కాబోలు. శత్రువుకైనా ఆదరించి అన్నం పెట్టుఅని మన నీతిసూత్రాలు చెప్తాయి. కాని అదేం కర్మో, భోజనాలదగ్గరే ఆ ఆదరణ లోపిస్తుంది. అక్కడకక్కుకుంటూ ఉన్న కోపతాపాలన్నీ ఒలకపోస్తూ యింటి యజమానికి, పిల్లలకీ అన్నం వడ్డిస్తుంది ఆంధ్రగృహిణి. అత్తగారు కోడలి మీదా, కోడలు గోడచాటునుంచీ, మాటలబాణాలు విసురుతూంటే యింటి యజమాని తలవంచుకుని అన్నంతినేసి బ్రతుకుజీవుడా అని బయటపడతాడు. ఇదీ భోజనాలసమయంలో చాలా సంసారాలలో జరిగేది.

“కమలమ్మ ఉత్తరం రాసినట్టుందండీ, ఆడకూతురు పుట్టినింటికి వెడితే మనం రమ్మని రాయకుండా ఎలా వస్తుంది ? వాడికి సిగ్గుగావుంటే, మీరేనా రాయకూడదూ?” అన్నీ వడ్డించి నేయిగిన్నె తెస్తూ మొదటిబాణం విసిరారు లక్ష్మమ్మగారు. తండ్రిముఖంలోకి చూశాడు రామారావు. సరదాగా అందరూ కూర్చున్నా అంతటా నిశ్శబ్దం ఆవరించుకుపోయింది.

“కోడలే రాసిందే. అయినా యిప్పుడెందుకూ రమ్మని

రాయడం ?" తలనిముకుని తినడానికి ఉపక్రమిస్తూ అన్నారు రామారావుతండ్రి.

అంతే ? పుట్టింటికెళ్ళిన కోడ లన్నాళ్ళా అక్కడ తిష్ట వెయ్యడం ? అయినా యిక్కడేం రాసి రంపాన పెడు తున్నామని ?"

"రాముడీ నెలాఖరుకి ఎలాగా ఇంకోవూరు వెళ్ళి పోతున్నాడు. కోడలు అక్కడికే వెడితే సయంకదూ?"

"ఊరికెడితే నెలా రెండూ - అంతేకదా? ఆమాత్రం దానికి అక్కడో కాపరమా!" బుగ్గలు నొక్కుకున్నారు లక్ష్మమ్మగారు.

"నెలా రెణ్నెల్లూ కాదు. వాడి నా వూరు బ్రాంచికి మేనేజరుగా వేశారు. అక్కడే వుంటాడు." ముభావంగా సమాధానం చెప్పారు.

"అయితే మనం ఎందుకూ యిక్కడ ? అంతా అక్కడేవుంటే కలిసివస్తుందికదూ. ఏరా రాముడూ, ఒక్క ముక్కైనా మాట్లాడవేం?"

"నాన్నగారు చెప్తున్నారుగా, నేనూ ఎందుకూ ?

సడే, యిదంతా గూడుపుఠాణీలావుంది. అయినా నాకెందుకు చెప్తారులెండి. ఇటు అయినదాన్ని కాదు, కాని దాన్ని కాదు."

"అదికాదే లక్ష్మీ! రావుడూ పెళ్ళాం అక్కడవేరుగా వుంటారు. అందుకు నీ అభ్యంతరం ఏమిటి? అయినా వాడి సంపాదన గాని వాడు కాదుగా మనకి ముఖ్యం?" అంటూన్న భర్తకేసి కన్నార్పకుండా చూస్తూ వుండిపోయారు లక్ష్మమ్మ

గారు. కొండంత నిజం ఆ క్షణంలో కళ్ళకికట్టేసరికి ఆవిడకి ఆశ్చర్యం వేసింది. అది సహజమే మనకి. దైనందిన ప్రవర్తనలో మనిషి లెక్కలేకుండా ప్రవర్తిస్తాం, మాట్లాడుతాం. కాని అది ఏమీ ఎబ్బెట్టుగా తోచదు మనకి. ఎదుటివారు విడమర్చి చెప్పిన క్షణంలోకాని అటువంటి కనువిప్పు జరగదు. అప్పుడు జరిగినా యిక ప్రయోజనం శూన్యం. ఎందుకంటారా, అప్పటికే మనసులు విరగడం జరుగుతుంది కనుక.

"లోగుట్టు పెరుమాళ్ళకెరుక అన్నట్టు, యింత గొడవలున్నాయని నాకేం తెలుసూ ? ఏదో కొడుకూ కోడలూ మాటపట్టింపులమీద ఉండిపోయారేమో అని వెర్రిబాగుల దాన్ని యిలా అఘోరిస్తున్నాను. వంగనాచీ వంగముల్లూ" అన్నారు. చదువుకున్నదీ, ఏం నాలా చేతకానిదా ఏం? అంటూ యింకా యింకా సాగతీసుకుంటూ మాట్లాడేస్తున్నారు లక్ష్మమ్మగారు. యీ రూపంలో - తల్లిని తొలిసారిగా చూస్తున్నట్టు దిగ్భ్రాంతి చెందాడు రామారావు. కమల ఏం చేసిందని ? అంటూ ప్రశ్నించింది అతని హృదయం. "దీన్లో కమల లాలోచీ ఏం లేదమ్మా" రామారావుమాట అక్కడితో ఆపేశారు లక్ష్మమ్మగారు. "అవునవును. దాన్ని మీరంతా వెనకేసుకురావడం, దానికిఅందలం ఎక్కించినట్టు అయింది. అందుకే అంత అలుసు. లేకుంటే, యింత ధైర్యమా ! ఒక్కింట్లో వుంటూ మొగుణ్ణి వేరింటి కాపరానికి పురమాయిస్తుందా ?... దాని తప్పేముందిలే ? మీరంతా యిచ్చిన లోకువ అది." తల్లినిచూసి నవ్వాలో కోపం తెచ్చుకోవాలో తెలియలేదు రామారావుకి. ఇక

మాట్లాడే ప్రయోజనం లేదని నిశ్చయించుకున్నాడు. మాటా మాటా పెరగడం, అరుచుకోవడం, ఏడుపులూ - తప్పించి ఇంకేం వుంటుంది ఫలితం? మూర్ఖంగా ఆలోచించేవాళ్ళతో వాదనకి దిగడం మొండిగోడకి తలబాదుకోడంలాంటిదే. అందుకే మాట్లాడకుండా చేయికడుక్కుని లేచాడు రామారావు.

ప్రశాంతమైన నీటిలో చిన్న గులకరాయి విసిరితే చాలు, అలలవలయాలు అంతులేకుండా బయలుదేరి అంచుల దాకా ప్రయాణించేస్తాయి. అవి ఎప్పుడు అంతంఅవుతాయో చెప్పలేం. ప్రశాంతమైన మనస్సులో చిన్న తపన రేగినా అంతే, అది వేగిన అలలవలయాలు అంతులేకుండా మెదడులో తిరుగుతూనే వుంటాయి. ఒక కొలిక్కి రానేరావు.

ఆఫీసులో కూర్చుని ఎన్నోసార్లు చదివాడు కమల రాసిన సుదీర్ఘమైన ఉత్తరం. తమ ఆరుసంవత్సరాల సాంసారిక జీవితం అద్దంలోలాగా ఆ వుత్తరంలో ప్రతిబింబించింది. ఆ జీవితంపొడుగునా నేపథ్యసంగీతంలాగా సాగిన సంఘటనలూ కళ్ళకి కట్టాయి రామారావుకి. జీవితంలో ఎన్నడూ ఏ స్త్రీనీ ఏ పురుషుడూ అర్థంచేసుకోలేదు అన్పించిం దతనికి.

అర్థరాత్రి దాటుతూంది. కిటికీలోంచి నక్షత్రాలు కన్పిస్తున్నాయి. వెన్నెల వస్తూంది. యింకా టేబుల్ లైట్ ఆర్పేయలేదు రామారావు. చేతిలో కమలఉత్తరం అలాగే పట్టుకుని అంతు తెలియని ఆలోచనలలో మునిగిపోయాడు. జరిగిపోయినవి కళ్ళకి కడుతున్నాయి. అప్పట్లో అర్థరహితంగా తోచిన వాటి కీనాడు కల్గిన కనువిప్పులో కొత్తవిలువ

కన్పిస్తూంది. భవిష్యత్తు పచ్చటితోరణంలాగా కళ్ళకి కడుతూంది.

భోజనాలదగ్గిర ప్రారంభంఅయిన రాద్ధాంతాన్ని అమ్మ యింకా కొనసాగిస్తూనేవుంది. ఏడుస్తూనే ఎదుటి వ్యక్తిని కఠోరవైకృత్తులాడగలనేర్పు ఒక్క ఆడవాళ్ళకే వుంది. ఇన్నాళ్ళూ తల్లిని చూసినవాడే అయినా యీరోజే ఈమెని ఓంప్రథమంగా చూస్తున్నట్టు అనిపించింది రామారావుకి. ఇంత స్వార్థం, సానుభూతిలేకపోవడం తనతల్లిలో ఉంటాయా అనుకున్నాడు. కాని ప్రతి స్త్రీహృదయంలోనూ వుంటాయి అవి. వయస్సుతోపాటు అవీ పెరుగుతాయి. వధువుగా భర్తచుట్టూ అల్లుకున్న ఆడదాని జీవితం – కొడుకు పెద్దవాడు కావడంలో అతనిచుట్టూ అల్లుకుపోతుంది. కొడుకుపై మమత అతిస్వార్థంతో పెంచుకుంటుంది తల్లి. కొడుకుసుఖం సర్వవిధాలా కోరి కోడలు రాకకోసం తహతహలాడుతుంది. కాని ఆ కోడలు తన కొడుకుపట్ల స్వార్థం కనుపరచడంతో ప్రారంభం అవుతుంది అసలు సంఘర్షణ. ప్రౌఢ నేర్పరి అయితే చక్కగా తప్పుకుంటుంది. మూర్ఖురాలైతే కోడలి నెలాగైనా దూరంచేయాలని చూస్తుంది. ఇదంతా కొడుకు మీది ప్రేమచేతనే. కాని ఎంత విభిన్నతత్వాలు యిమిడి వున్నాయి మనలో. తలుచుకుంటేకూడా ఆశ్చర్యం వేస్తుంది.

తలగడా ఏటవాలుగా పెట్టుకుని జేరపడికూర్చున్నాడు రామారావు. కమల రాసిన ఉత్తరం తిరిగి చదవడం ప్రారంభించాడు. చదివినకొద్ది ఎక్కువ గంభీరంగా కన్పిస్తున్నాయి దానిలోని భావనలు. "నేను చదువుకోవాలని చదువుకోలేదు.

కాలక్షేపానికి చదువుకున్నాను. తగిన సంబంధాలు దొరక్క చదివించారు నన్ను. దీన్లో నా తప్పేం వుంది చెప్పండి? చదువు ఎంత వద్దన్నా కొంత లోకజ్ఞానాన్ని, సంస్కృతిని యిస్తుంది. చదువుకున్నాక ప్రవర్తించాలన్నా జంతువులా ప్రవర్తించలేం. ఎంతచంపుకోవాలన్నా హృదయంలో వెలుగు చావదు. సంకుచితం అయిపోదు మనసు. ఎంతగా గాయ పడ్డా దానికి వివేకం పోదు. తర తమాలు ఆలోచించడం, ఓర్చుకోవడం అలవాటుచేసుకున్న నాగరికత గల వ్యక్తిగా తయారై నేను గట్టిగా ఏడవనుకూడా లేను. నిజమే. ఒక్క సారి ఏడిస్తే మనస్సు తేలికపడుతుంది. ఆ అవకాశంకూడా లేదు నాకు.

నే వచ్చి రెండు నెలలు దాటినా ఉత్తరం రాయక పోడానికి కారణం ఒకటే. నేను పూర్వాపరాల విలువలు కట్ట ప్రయత్నించాను. నావల్ల ఏ తప్పూ లేకుండా ప్రతి క్షణం అవమానింపబడి, బ్రతకడం ఎందుకు అలవాటు చేసు కోవాలి? నాకోసం నువ్వు అనుభవించు అంటారా? పోనీ అలాగే, కాని మీకు మటుకు నన్ను ఎలా చూశారు. మీకు జ్ఞాపకం లేదూ. మీరూ మాటలతో నన్ను గాయపరచిన సమయాలు లేకపోలేదు. అతిప్రేమవల్లా, దురభిమానంవల్లా ఒకళ్ళని ఒకళ్ళు గాయపరచుకోవచ్చు. కాని యిది అతి ప్రేమవల్ల అని అనిపించే ఒక ఉపశమనపుమాటకూడా ఎప్పుడూ మీరు అనలేదే. అలాంటప్పుడు పూర్వాపరాల విలువలు యీరోజు నే కట్టడంలో తప్పులేదు.

జీవితంలో ఆడదానికి వివాహం ఒక బ్రహ్మాండమైన మార్పు. తన జీవిత భాగస్వామితో సమఉజ్జీగా ఉండాలని, కష్టసుఖాలని ఒడుదుడుకులని పంచుకోవాలని కోరుకుంటుంది. అంతేకాని నీ కెందుకొచ్చిన గొడవలంటూ మాటిమాటికీ కసురుకోవడం, నువ్వేమీ పట్టించుకోకుఅంటే పట్టించుకోకుండా ఉండగల్గడం ఆడదాని తత్వంకాదు. మీరు నా ఇంట్లో నన్ను పరాయిదానిలా బ్రతకమని శాసించడం ఏం భావ్యం చెప్పండి. అది నీయిల్లు కాదు అంటారా? అలాంటప్పుడు అక్కడ నే నెందుకు వుండడం?

ఇక్కడికి రాగానే నాన్నగారు కోప్పడ్డారు, కోపంవస్తే యిలా వచ్చేస్తావా అని. కాని ఆయనకి నేను చెప్పగల్గాను - ఎటువంటి పరిస్థితులలో రావలసివచ్చిందో. నన్నో మనిషిగా చూడండి నాన్నా, మీరేనా, అని ప్రాధేయపడ్డాను. అప్పుడే అర్థం అయింది నాన్నగార్కి. నేనూ ఒక బాధ్యతగల వ్యక్తిగా పెరిగానని, నాలో అగ్నిపర్వతాలు పెరిగాయని, నాకు ఆలోచించుకుందుకు వ్యవధికావాలని. చదువుకునే రోజుల్లో నాన్నగారుట్టి మూర్ఖులుగా కన్పించేవారు. నా కే మాత్రం వ్యక్తిత్వం యివ్వకపోవడం నా కెంతో చిన్నతనంగా వుండేది. ఇక వారిమాట కెదురులేని పరిస్థితిలో పెరిగాను. కాని యీరోజు ఆ నాన్నగారే, నన్నో వ్యక్తిగా గుర్తించి నే చేసినపనిలో తప్పేంలేదని గ్రహించి నాకు కొండంత ధైర్యం యిచ్చారు. నా కెంతో గర్వంగావుంది. నాన్నగారిలాగే మీరూ కాలక్రమాన నన్ను గుర్తించగల్గితే సంతోషమే. అప్పటిదాకా నే నిలాగే వుండదలిచాను. కాలక్షే

పానికి చిన్నపిల్లలకి చదువుచెప్తాను. యీ ఉద్యోగంలో ఒడుదుడుకులు లేకుండా యింట్లో ప్రశాంతతకి భంగం లేకుండా కాలక్షేపంచేయండి.

ఉత్తరం ముగించేముందు నే నీ సంగతి రాయకుండా వుండలేను. జీవితంలో దానపాత్రత గొప్పది. కాని కట్నం దానంకాదు. అది అడిగిపుచ్చుకున్న విలువ. అది పుచ్చుకున్న వ్యక్తి, యిచ్చిన వ్యక్తికీ మధ్య ఏర్పడేది సన్నిహిత సంబంధమే అయినా ఆ బంధుత్వంలో సమానత్వం కన్పిస్తుందంటారా? అయినాకూడా అదేం వింతో కట్నం యిచ్చి మరీ యింటికి వచ్చినా కోడలు కోడలుగానే ఉంటూంది. యీ చిక్కుప్రశ్నకి సమాధానం తెలిచుడంలేదు నాకు."

రామారావుఅలావుత్తరం చదువుతూనే నిద్రపోయాడు. అతనికి అన్ని చిక్కుప్రశ్నలకీ సమాధానాలు దొరికాయి. యీప్రపంచంలో ఆర్థికమైన అవసరాలని అనుకోని బాంధవ్యాలు పెరుగుతాయి, తరుగుతాయి. కాలంతోపాటు యీ సంగతి మరీ నిజంఅయిపోతూంది. మెల్లిమెల్లిగా సమిష్టి కుటుంబాలు అంతరించిపోవడానికి కారణం యిదేనేమో. నెలనెలా కొంత మొత్తం తప్పకుండా పంపుతాడు అన్న ధైర్యం తోచగానే రామారావు తండ్రికి కొడుకు వేరు వెళ్ళడంలో యిబ్బంది ఏం కన్పించలేదు. కొద్ది రోజుల అలవాటుతో లక్ష్మమ్మగారికే అది బోధపడిపోతుంది. అప్పుడు దూరం హృదయాలను దగ్గరకి తెస్తుంది...అన్నది నిజం అవుతుందేమో.

భవిష్యత్తుపై ఆలోచనలతో నిద్రపోయాడు రామారావు. అతనిలో నిద్రిస్తూన్న స్తబ్ధత యీనాడు తొలగిపోయింది. జీవితంలో శాంతిసౌఖ్యాలు కాలాన్ని నెట్టుకు రావడంతో లభ్యం కావనీ, దృఢనిశ్చయాల పునాదులమీద వాటిని నిర్మించుకోవాలనీ బోధపడింది. దానిలో అతని హృదయం కమలను కొత్తచూపుతో తిలకించింది. యీ కొత్తవెలుగు అర్థాన్ని ఎప్పుడా కమలకి చెప్పడం అన్న ఆత్రుత క్షణక్షణం పెరిగింది, అతని శాంతి నిండిన హృదయంలో. నిజమే. కొన్ని నిర్ణయాలు ఎదుటివారిని గాయపరుస్తేగాని చేసుకోలేం. కాని అవి చేయక తప్పదు అన్నప్పుడు ధైర్యంతో చేయకల్గడమే వివేకవంతుల లక్షణం. అదే కొత్తపాటకి పల్లవి అవుతుంది.

## 6

“ఏరా, నే నంత పాపిష్టిదాన్నా? ఒక్క కొడుకువి, అచ్చటా ముచ్చటా అన్నీ నువ్వేకదరా తీర్చాలి? నే నేం ద్రోహం చేశానురా నీకు? అని కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చారు లక్ష్మమ్మగారు. అందరూ ఏమనుకుంటారురా? లోకం కాకై కూయదూ - నే నింత గయ్యాళినని. నేనేం దాని రాసి రంపాన పెట్టానా? అంత యిక్కడ నిలవలేక పోవడానికి?”

“నీకు చెప్పినా అర్థంకాదమ్మా, నన్నుట్టినే వేధించకు. మీ యిద్దరికీ సర్దుకుపోవడం తెలియనప్పుడు నే నెందుకూ మధ్యన నలిగిపోవడం!” పేపరుమీదనుంచి దృష్టిమరల్చకుండానే అన్నాడు రామారావు. “అంటే ఏమిటిరా నీ

ఉద్దేశం ? మీరిద్దరూ హాయిగా వుంటే చూడలేకుండా వున్నాననా ? నిలబడి నీళ్ళైనా తాగనివ్వనట్టు మాట్లాడుతావేంరా. పుట్టి పెరిగి పెద్దవాడివైనది నా చేతుల్లోకదరా!”

“కాదని అనలేదమ్మా నేను. కాని నన్నెందుకు అర్థం చేసుకోవు ?”

“అర్థం చేసుకోక ఏంచేస్తున్నానురా. అర్థం అయిందిగా, బాగా అయింది. నీకూ దానికీ యిక్కడ వుండడం యిష్టం లేదు. అందుకని దోషం నాదన్నట్లు చేస్తారేం ? నీ సుఖం కాకుంటే నే కోరేదేముందిరా ? నీ స్తోమతుకు తగి వుండాలనికదూ డిగ్రీ అమ్మాయిని వెతుకుత. నీ స్తోమతుకు తగివుండాలనేకదూ కట్నం అంతకి తగ్గకుండా నిలబడత. ఇదంతా నువ్వెందు కర్థంచేసుకోవురా! మీనాన్నా నన్ను వదలించుకున్నట్లు మాట్లాడుతాకు, నువ్వూ నీ చెల్లెళ్లూ అంతే చేస్తారు. యిక నే నెలాగరా? నే మనిషినికాదనా మీ అందరూ అనుకోడం ?” నిలదీసినట్లు లక్ష్మమ్మగారు ప్రశ్నిస్తూంటే నిజానికి రామారావుకి సమాధానం దొరకలేదు. యీ అమ్మ యింత వెర్రిబాగులదిగా కన్పిస్తుంది. ఇంత ఓర్వలేనిదానిలా కన్పిస్తుంది. ఇంత హృదయ విదారకంగా మాట్లాడుతుంది. ఎలాగ సమాధానం చెప్పడం? ఇంత అమాయకంగా అడుగుతూంటే జాలేవేస్తుంది. ఇంత నంగనాచిలా ప్రవర్తిస్తే అసహ్యంవేస్తుంది. కాని రామారావు యీ విభేదాలకి మూలం విడమర్చి మాటల్లో చెప్పాలని అనుకున్నాడు. నెమ్మదిగా అసలీ తేడాలకి కారణం

చెప్తే అర్థంచేసుకుంటుందేమో. అప్పుడేనా యింట్లో మగ వాళ్ళకి మనశ్శాంతి లభిస్తుందేమో అనిపించింది.

“అమ్మా, నే చెప్పేది అడ్డుప్రశ్నలు వేయకుండా వింటావా ? ...జీవితంలో పెళ్ళిఅంటే ఏమిటో అర్థమేనా తెలియని వయస్సులో నీకు పెళ్ళయింది. నీరోజులు వేరు. నీ రోజుల్లో బాంధవ్యాల విలువలు వేరు. ఇంటికోడలు సంతోషంగానో, ఏడుస్తూనో యింటిల్లపాదికీ వండి వడ్డించడం, గంపెడు సంతానంతో, ఊపిరిసలపని పనిపాటలతో కాలక్షేపంచేయడం అందం. కాని యీరోజుల్లో అలా లేదే. ఆడపిల్లలకు బాగా ఇంగితజ్ఞానం వచ్చాకగాని పెళ్ళిళ్ళు కావడంలేదు. వరుడికి నచ్చితే చాలు పెళ్ళిముహూర్తం నిర్ణయించేసేవారు – కాని యీనాడు అలా కాదే. అమ్మాయికి సహితం పెళ్ళికొడుకు నచ్చాడా లేదా అని అడుగుతున్నారు. అమ్మా! ఇంటికి కోడలు వచ్చాకకూడా యీ మార్పు తప్పదుకదా ? అదెందుకు నీకు తోచదూ ? నే ఒకటడుగుతాను చెప్పమ్మా, నన్నెంతో చదివించారు. కాని నా వ్యక్తిత్వాన్ని ఎప్పుడేనా గౌరవించారా ? నాకు కట్నం యిచ్చి పెళ్ళివద్దని ఎంత చెప్పినా, విన్నారా ? నా యిష్టానికి వ్యతిరేకంగా ఒప్పించి పెళ్ళిచేశారు. చదువుకున్నందుకు పౌరుషాలు తప్పించి నాకూ కమలకి మీ రేం మిగిల్చారమ్మా ? మీరేం మిగిలించారు ? కమలా నాలాగే చదువుకుంది. ఇంగితజ్ఞానం పెంచుకుంది. కట్నం పుచ్చుకుని నేను పెళ్ళిచేసుకున్నాను. అలాంటప్పుడు నామీద గౌరవం ఎలా పెరుగుతుందమ్మా, నన్ను కొనుక్కుందికదా. ఇలా అడిగితే

నీకు ఎబ్బెట్టుగా వుంటుంది. నీకు చదువులేదుకనుక. కాని చదువు సంధ్యలున్న కమలకి దాన్లో తప్పేం కన్పించదు. డబ్బుకీ బంధుత్వానికీ ముడివేసేదీ మీరే, ఆ బంధుత్వాం చిలవలూ పలవలుగా అల్లుకోకపోతే బాధపడేదీ మీరే అయితే ఎలా?

చదువున్న కోడలు కావాలని తహతహలాడిపో యావు. తీరాచేసి వచ్చాక ఏమైంది? అన్నిటికీ అడ్డం వచ్చింది కమలచదువే. నువ్వూ చెల్లెలూ ఏం చేశారు? ఇలా నడిస్తే చదువుకున్నపిల్ల, అలా చేస్తే చదువుకున్నపిల్ల అంటూ దెప్పారు. ఓ వింతజంతువుని చూసినట్టు చూశారు. తనింట్లో తనే పరాయిదానిలా ఫీల్ అయేలా చేశారు. అంతేనా అమ్మా?" జేబులోంచి సిగరెట్టు పెట్టీ, అగ్గిపెట్టె తీశాడు రామారావు. కాని మళ్ళీ అంటించకుండానే జేబులో పెట్టేశాడు. రెప్పవాల్చకుండా లక్ష్మమ్మగారు ఎక్కడో చూస్తున్నారు. ఆవిడదృష్టి ఏ వస్తువుమీదా ప్రత్యేకించి లేదు. దూరతీరాలని తిలకిస్తూంది. "ఏమిటమ్మా? ఆలోచిస్తున్నావు?" అన్న రామారావు మాటలకి ఉలిక్కిపడి యిటు చూశారు లక్ష్మమ్మగారు. 'ఇప్పుడే వస్తానురా—' అంటూ లేచి లోపలికి వెళ్ళిపోయారు. తల్లి ముఖంలో కనిపించిన గాంభీర్యాన్ని చూసిసంతోషించాడు రామారావు. ఆవిడచూపు చూస్తేనే అర్థమయింది అతనికి - అమ్మ దీర్ఘా లోచన చేస్తూందని.

అంతటా నిశ్శబ్దం ఆవరించుకుంది. పేపరు ఒళ్లో పడేసుకుని సిగరెట్టు తీశాడు రామారావు. వాలుకుర్చీలో

జేరబడి కళ్ళుమూశాడు. తల్లి మనస్సు నొప్పించకుండా పరిస్థితి విడమర్చి చెప్పకల్గినందు కతనికి ఆనందం కలిగింది. మనస్సంతా శాంతితో నిండింది. ఇక రాత్రిభోజనాలదగ్గిర గాని అమ్మ తనఉద్దేశాలు వ్యక్తంచేయదు, అని చిన్నగా నవ్వుకున్నాడు రామారావు.

రామారావుప్రయాణానికి అన్నీ సిద్ధంఅయాయి. ఇక వారంరోజులలో వెళ్ళిపోతాడనగా ఒకనాటిమధ్యాహ్నం లక్ష్మమ్మగారు వచ్చి దగ్గర కూర్చున్నారు. "ఒరే రావుడూ కమలని యిక్కడికి రమ్మని రాయి, ఇక్కణ్ణించే కలిసి యిద్దరూ వెడుదురుగాని" అన్నారు.

"అక్కణ్ణుంచే అలాగ వస్తుందేమోనమ్మా," అన్నాడు రామారావు. 'అలా కాదురా, నువ్వేకదురా అంటావు మనిషిలో మార్పురావాలని - కమలమ్మని ఇక్కడికి రమ్మని రాయి. నేను రమ్మన్నానని రాయి.' అంటూ నొక్కి చెప్పారు లక్ష్మమ్మగారు. 'రాస్తాను రాస్తాను' అంటూనే నాలుగురోజులు గడిపేశాడు రామారావు. ఐదోరోజు లక్ష్మమ్మగారి వత్తిడి ఎక్కువ అయింది. 'స్టార్ట్ ఇమీడియెట్లీ' అంటూ టెలిగ్రాం యివ్వక తప్పలేదు. కమల చేసుకున్న దృఢనిశ్చయాల దృష్ట్యా చూస్తే యీ టెలిగ్రాంకి ఫలితం ఎలావుంటుందోకూడా ఊహించ లేకపోయాడు రామారావు.

లక్ష్మమ్మగారు కొడుకు వేరింటికాపురానికి కావలసిన వన్నీ సర్దుతున్నారు. బట్టా పాతా అన్నీ సరిగ్గా వున్నాయా లేదా, ఏం మరిచిపోతామో ఆఖరు క్షణంలో అన్న హడావిడిలో వున్నారు యింట్లో అంతా. కాని రామారావు

మనస్సుమటుకు అర్థం తెలియని ఆలోచనలతో సతమతమై పోతూంది. కమల వస్తుందో? రాదో? ఇక్కడి వాతావరణం వస్తే ఎలా మారుతుందో? రాకుంటే ఎలా మారుతుందో? అన్న ఆలోచనలో పడిపోయాడు.

* * *

రామారావు రాసిన ఉత్తరాలు చదువుని కమల ఎటూ తేల్చుకోలేకపోయింది. ఆరేళ్ళ ప్రయత్నంలో ఎవరూ మారనిది ఈ కొద్దిరోజులలో మారిపోతారా? అనుకుంది. కాని నిజంగా కనువిప్పుజరిగితే మారడంలో అంత ఆశ్చర్యంలేదు. స్తబ్దులుగా పడివున్నవారిలోకూడా చైతన్యం అన్నది ఏ క్షణంలోనైనా రావచ్చు. అది ఆక్షణా లోనే ఎందుకురావాలి? అని అడిగితే సమాధానంమటుకు దొరకదు. భర్తదగ్గరనుంచి వచ్చిన టెలిగ్రాం తండ్రికి చూపెట్టింది. 'ఏం చెయ్యమంటారు నాన్నా?' అని అడిగింది.

'ఆలోచించి ఎలా చేస్తే బాగుంటుందని తోస్తుందో అలా చెయ్యి కమలా. కాని ఒక్కటిమటుకు జ్ఞాపకం వుంచుకో. ఒకసారి నీకాళ్ళమీద నువ్వు నిలబడాలని పౌరు షంగా బ్రతకాలని నిశ్చయించుకుని వచ్చావు. తిరిగి మామూలుగానే బ్రతికేద్దాం, పోనీలే అనుకున్నావో యిది వరలో వున్న గౌరవం అభిమానంకూడా పోగొట్టుకున్న దానివి అవుతావు.'

'అది నిజమే నాన్నా, కాని రమ్మని అంత యిదిగా రాస్తూన్నప్పుడు పూర్వపు ప్రవర్తనకి పశ్చాత్తాపపడ్డప్పుడు నే నింకా మొండిపట్టు పట్టితే మూర్ఖం అనిపించుకోదూ? ఎలాగా మేం చేసుకున్న నిర్ణయాలు మారవు. అలాంటిది

రెండునాళ్ళు అక్కడ సరదాగా కాలక్షేపం చేయడంలో బాధేం వుండదు నాన్నా. ఏమంటారు? అందుకే వెడితేనే బాగుంటుందని తోస్తుంది నాన్నా.' అంటూన్న కూతురు ముఖంలోకి ఆశ్చర్యంతోటి వాత్సల్యంతోటి చూశాడు సూర్యనారాయణగారు. అవును. ఇంత లోకజ్ఞానం అబ్బిన కూతుర్ని చూసి తండ్రి హృదయం పులకరించింది. మూర్ఖంగా ప్రవర్తించి అటు కాపరానికి, నీళ్ళు వదులుకో లేదు. చదువూ సంధ్యలు లేని గబ్బిలాయిలాగా బానిసలాగే బ్రతికేద్దాం - ఈ పరిస్థితులకి ఎదురీదలేం అని చేతకాని నిర్ణయాలూ చెయ్యలేదు. చదువుకున్నందుకు తండ్రి పరువూ తనపరువూ కూడా నిలబెట్టుకుంది. 'సరేతల్లీ! రేపే ప్రయాణానికి అన్నీ సిద్ధంచేస్తాను. నువ్వన్నీ సర్దుకో'అంటూ కండువా వేసుకు బయలుదేరారు సూర్యనారాయణగారు.

కమలమనస్సు పరిపరివిధాల పోతూంది. తీరాచేసి వెడితే తిరిగి ఏం రాద్ధాంతాలు వస్తాయో. పరిస్థితులు ఎలా తారుమారుఅవుతాయో ఎలాగ ఊహించడం! అయినా వెళ్ళక తప్పదు. హృదయపూర్వకంగా హామీ యిస్తూన్న భర్తమాట కాదనడంలో అందంలేదు. అందుకే తల్లి సహాయంతో అన్నీ సర్దుకోవడం మొదలుపెట్టింది. కొత్తకాపరానికి కావలసినవన్నీ ఎంతో ఆప్యాయంతోటి తల్లి సర్దుతూవుంటే కమలకి తల్లిపట్ల ఆప్యాయం అభిమానమూ పెల్లుబికాయి జీవితం ఎంత చిత్రమైనది. సుఖజీవనం సాగించడానికి యిన్ని అనుబంధాలుండాలి కాబోలు.

తల్లిదండ్రులకి పిల్లలమీద పిల్లలకి వ్యక్తిగతసంసారాలమీద యిలాంటి అభిమానం లేకపోతే జీవితమే అర్థంలేనిది అయిపోతుంది. వ్యర్థంగా తోస్తుంది. ప్రవాహవేగంలాగా సాగిపోయే జీవితంలో సుఖ్ఖా, పాటుపోట్లూ తప్పవుకదా.

రైలునుంచి కమలని తీసుకురావడానికి రామారావు వచ్చాడు. తొలిసారి తను ఎవరికోసమైతే వేయి కళ్ళతో వెతికిందో ఆ వ్యక్తి కీనాటికి అనిపించింది తన జీవిత భాగస్వామి వస్తూంది, తనే వెళ్ళి తీసుకురావాలని. ఈమాత్రే చాలు కమలకి. కాలం పరిస్థితులూ మారాయని అవి తిరిగి వెనక్కి అడుగేయవని తోచడానికి. రైలు ఆగీ ఆగకుండానే అన్ని పెట్టెలనీ ఒక్కసారే చూసేద్దామన్న ఆత్రుతతో తనకోసం వెతుకుతున్న భర్తనిచూసి నవ్వుకుంది కమల. నిజమే, దూరం హృదయాలని దగ్గరకి చేరుస్తుంది - విరహం ప్రేమని పెంపొందించినట్లూ ఎడబాటు విరహాన్ని పెంచినట్లూ.

'రా, కమలా' అంటూ చేతిలోని సూటికేసు అందుకున్నాడు రామారావు. మాటలక్కరలేకుండానే అతనికళ్ళు వాక్యాలు చదువుతున్నాయి. మనస్సులో కోర్కెలని కొలిచి చెప్తున్నాయి అతని కళ్ళు.

'రమ్మని ఉత్తరంరాస్తే చాలదనా టెలిగ్రాంఇచ్చారు?' అడిగింది కమల - చిన్నగా నవ్వుతూ.

'ఇక మనం యిక్కడవుండే వ్యవధి చాలా తక్కువ కమలా, ఆదివారం ఉదయాన్నే వెళ్ళిపోతాంగా, అందుకని అమ్మమాట కాదనలేక టెలిగ్రాం యిచ్చాను' అన్నాడు రామారావు.

కొడుకూ కోడలూ బండి దిగగానే లక్ష్మమ్మగారు దిష్టి తియ్యడానికి పారాణినీళ్లు పట్టుకుని ఇవతలకి వచ్చారు. 'ఇదంతా ఎందుకత్తయ్యా, కొత్తగా ఏం రాలేదుగా?' పలకరింపుగా అంది కమల. కళ్ళనీళ్ళు తిరిగాయి లక్ష్మమ్మగారికి. అవి ఆనందంవల్లో పశ్చాత్తాపంవల్లో తెలియదు. 'నిజంగా ఈ యింటికి నువ్వు ఎప్పుడూ కొత్తకోడలివే కమలా!' అంటూ దిష్టితీసి బొట్టుపెట్టారు.

రెండు రోజులూ రెండు క్షణాలుగా గడిచిపోయాయి. ఆదివారం ఉదయం యిట్టే వచ్చింది. ఇల్లంతా ప్రయాణం హడావిడిలో ఊపిరిసల్పనట్టుంది. కమల తలంటుకుంది. అత్తగారు యిచ్చిన కొత్తచీర కట్టుకుంది.

బండి వచ్చింది. బండి ఎక్కేముందుదాకా చాలా గంభీరంగావున్న లక్ష్మమ్మగారు కోడలిని పక్కకి పిలిచారు. "కమలా, నువ్వు చదువుకున్నదానివి కనుక సరిపోయింది. ఇంకో మూర్ఖురాలైతే నా కొడుకు జీవితం ఈ పాటికి ఇన్ని ఒడిదుడుకులకీ, నిష్ఠూరాలకీ తట్టుకోలేక ఎడారిగా మారిపోయేది. నువ్వు చిన్నపిల్లవి. నేను, నా ప్రవర్తనకి సిగ్గుపడ్డాను అనగలనేగాని నిన్ను క్షమించమనను.'

'అలా అనకండి అత్తయ్యా, అందరూ కొత్తవాళ్ళని అపార్థంచేసుకోవడంలో వింతలేదు. కలతలన్నీ పోయాక యిప్పుడివన్నీ ఎందుకూ? మీరు అన్నీ మరిచిపోండి' అంటూ వంగి నమస్కారం పెట్టింది. కమలని ఆప్యాయంగా కౌగలించుకుని తలనిమిరారు లక్ష్మమ్మగారు. 'కమలా, అడపా తడపా సెలవులకి వస్తూండండి' అని చెప్పి బండిఎక్కించారు.

'తప్పకుండాను, వస్తామమ్మా' అంటూ రామారావూ బండి ఎక్కాడు. 'ఈమాటు సీమంతపు పెళ్ళికొడుకుగా రా రావుడూ' అంటూ నవ్వారు లక్ష్మమ్మగారు.

బండి కదిలింది. దానితో పాటే కాలం కదిలింది. ఇక వెనక్కి మళ్ళదు కాలం. కాలాని కనుగుణ్యంగా జీవితపరిధులను దిద్దుకున్న రామారావూ, కమలా ముందుకు సాగారు. వారి గమ్యం ఒకటే. వారి బాట ఒకటే. దాని కిక మలుపు లేదు.

కథా నిలయం
935
శ్రీకాకుళం